
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.03.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 41 పేజీలు : 12, వెల : ₹ 5





# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# సీమాంధ్రలో సెమీఫైనల్స్!



- ముని్సపల్, పంచాయితీరాజ్ ఫలితాలతో తేలనున్న ఇరు పార్టీల భవితవ్యం
- ఒకరికి వై.యస్. ఇమేజ్, ఇంకొకరికి కుల సమీకరణలే బలం



**ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. తెలంగాణ రాజకీయాలతో మనకు సంబంధం లేకుండా పోయింది. ఇప్పుడు అక్కడ టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో మనకు పని లేకుండా పోయింది. విభజన జరిగిపోగా మిగిలిన సీమాంధ్రలో ఏ పార్టీ బ్రతుకు, భవిష్యత్ ఏంటన్నదే ప్రశ్న?**

సీమాంధ్రలో కాంగ్రెస్ పని అయిపోయింది. రేపు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ టిక్కెట్లు అడిగే నాయకులు కూడా లేరు. ఇక సీమాంధ్ర రాష్ట్రంలో అధికారం అటు జగన్ చేతికన్నా పోవాలి, లేదా చంద్రబాబు కన్నా రావాలి. కాంగ్రెస్ చావు ఈ రెండు పార్టీలలో ఎవరికి కలిసిరానుందో చూడాలి. గతంలో రాష్ట్రంలో రెండు దఫాలు ఉపఎన్నికలు జరిగాయి. అప్పుడు జగన్ ప్రభంజనం బలంగా కనిపించింది. అదే వాతావరణం ఇప్పుడు కూడా ఉంటే చంద్రబాబు ఇంత శ్రమపడి ప్రచారం చేయనవసరంలేదు. ఏ.సి వేసుకుని ఇంట్లో పడుకోవచ్చు. జగన్ ప్రభంజనం అంత బలంగా లేదని, బాగా తగ్గిందని చంద్రబాబు నమ్మకం. అందుకే ఒంట్లో శక్తినంతా కూడదీసుకుని బలవంతంగా బలంగా తిరుగుతున్నాడు. చంద్రబాబుకు సంబంధించినంత వరకు ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్య. ఇప్పటికే రెండుసార్లు అధికారానికి దూరమై ఆయన మానసికంగా దెబ్బతిన్నాడు. మనిషి యోగా, ధ్యానం చేస్తూ డ్రైఫ్రూట్స్ తింటున్నాడు. కాబట్టి తట్టు కోగలిగాడు. ఈ పదేళ్లు కూడా

(మిగతా 10వ పేజీలో)



## అన్న మూసేసాడు... తమ్ముడు తెరిచాడు

మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి రాజకీయం పెద్ద వ్యాపారమైపోయింది. "సేవే లక్ష్యం – ప్రేమే మార్గం" అంటూ ప్రజారాజ్యం పార్టీని స్థాపించి, 2009 అసెంబ్లీ ఎన్నికల తర్వాత దానిని హోల్‌సేల్‌గా కాంగ్రెస్ పార్టీకి బేరంపెట్టిన ఘనత చిరంజీవిది. పార్టీని అమ్ముకున్నందుకు గాను ఆయనకు రాజ్యసభ, కేంద్రమంత్రి పదవి లభించాయి. 2009 ఎన్నికల తర్వాత కొన్ని నెలలు కూడా ఆయన పార్టీని నడపలేకపోయారు. చిరంజీవి దుకాణం

(మిగతా 10వ పేజీలో)

## జిల్లా అంతా... ఎన్నికల జాతర

**రంగడి బ్రహ్మోత్సవాలు, బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ, కోడూరు వేళాంగిణి ఉత్సవాలు, వెంకటగిరి పోలేరమ్మ జాతర... ఇవన్నీ కలిపి ఒకేసారి నిర్వహిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది ఇప్పుడు జిల్లాలో ఎన్నికల జాతర. జిల్లాలో ఎక్కడపట్టినా ఎన్నికల తిరునాళ్ళే! ఎవరినోట పట్టినా గెలుపోటముల మాటలే!**

ఆల్‌రెడీ జిల్లా అంతటా మున్సిపల్ ఎన్నికల వాతావరణం వేడెక్కిపోయింది. అభ్యర్థుల ఎంపికలు, టిక్కెట్లు రాని నేతల అలకలు, బుజ్జగింపులు, నాయకుల పార్టీ జంపింగ్‌లు భలే జోరుమీదున్నాయి. నెల్లూరు నగరపాలకసంస్థలో ఎన్నికల కోలాహలం నెలకొంది. నెల్లూరులో ప్రధాన పోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల మధ్యే నెలకొంది. కాంగ్రెస్ టిక్కెట్లను అడిగేవారే లేకుండాపోయారు.

(మిగతా 10వ పేజీలో)



## వ్యర్థప్రయత్నం... జై సమైక్యాంధ్ర

కొలిమి కాకమీదున్నప్పుడే ఇనుమును వంగతీయాలి. కొలిమిలో నిప్పు ఆరిపోయాక ఇనుమును వంచాలంటే కుదురుతుందా? ఇప్పుడు మాజీముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి పెట్టిన పార్టీ పరిస్థితి కూడా అంతే! సీమాంధ్రలోని 13జిల్లాల ప్రజలు సమైక్యాంధ్ర ఉద్యమంతో రగిలిపోతున్నప్పుడు, కాంగ్రెస్ అధిష్టానం మీద పీకలదాకా కోపం పెంచుకుని ఉన్నప్పుడు ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా పడేసి కాంగ్రెస్ నుండి

(మిగతా 10వ పేజీలో)

## నగరంలో కాంగ్రెస్‌కు షాక్




నెల్లూరు నగరపాలక సంస్థపైన తనదైన ముద్రవేసుకుని మంచి చెడ్డ అన్నీ భరిస్తూ దాదాపు రెండు దశాబ్దాల పాటూ ధైర్యంగా ముందుకు దూసుకుపోయింది మాజీమేయర్ నందిమండలం భానుశ్రీ.

(మిగతా 10వ పేజీలో)




## ప్రచారానికి జగన్ బాణం




వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి జగన్ వదిలిన బాణంలా షర్మిల నెల్లూరు జిల్లాకు రానున్నారు. ఈనెల 17నుండి 20దాకా ఆమె జిల్లాలో ప్రచారం నిర్వహించనున్నారు.

(మిగతా 10వ పేజీలో)




# జనరల్ పోరాటమే

## ఈసారీ జనరల్ అయిన జిల్లా పరిషత్ ఛైర్మెన్ పదవి

**ఓ పక్క శాసనసభ, లోక్‌సభ మరోపక్క మున్సిపల్ ఎన్నికలు... ఛస్తారో బ్రతుకుతారో మాకు తెలియదు, ఆలస్యం చేసినందుకు మీకిదే శిక్ష అంటూ సుప్రీంకోర్టు జడ్పీ ఎన్నికలను కూడా నిర్వహించమని ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో గుంపులోగోవింద అన్నట్లుగా జిల్లా పరిషత్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు ఏప్రిల్ 6వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమీషన్ నిర్ణయించింది.**

నెల్లూరుజిల్లా ప్రజాపరిషత్ ఛైర్మెన్ పదవి రెండోసారి కూడా జనరల్ అయ్యింది. దీంతో ఈ పదవి కోసం ప్రధానపార్టీల నుండి పలువురు అభ్యర్థులు పోటీపడే అవకాశాలున్నాయి. 1996లో ఎస్సీ మహిళకు జడ్పీఛైర్మెన్ పదవిని కేటాయించారు. అప్పుడు నాగభూషణమ్మ కొంతకాలం, ఆ తర్వాత నెల్లూరు కౌసల్యమ్మ ఛైర్‌పర్సన్‌లుగా పనిచేసారు. 2001లో బి.సి రిజర్వేషన్ వచ్చింది, అప్పుడు పోటాపోటీగా జడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. రెండేరెండు సీట్లు ఎక్కువ వచ్చి జడ్పీ ఛైర్మెన్‌గా పి.చెంచలబాబుయాదవ్ ఎన్నిక కావడం జరిగింది. 2006లో ఈ పదవి జనరల్ అయ్యింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 31సీట్లు, తెలుగుదేశంకు 15సీట్లు వచ్చాయి. కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఛైర్మెన్ అయ్యారు. 2011లో జడ్పీ ఎన్నికలు జరిగి ఉండాలి, కాని సీఎంగా వుండిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఆ ఎన్నికలను నిర్వహించే సాహసం చేయలేకపోయారు. దీంతో మూడేళ్ల పాటు ఎన్నికలు వాయిదా పడి ఇప్పుడు జరగబోతున్నాయి. మళ్ళీ ఇప్పుడు జడ్పీ ఛైర్మెన్ పదవి జనరల్ అయ్యింది. దీంతో ప్రధానపార్టీలలో వేడి రగిలింది. అసెంబ్లీ టిక్కెట్లు రాక నిరాశ చెందిన అభ్యర్థులను జడ్పీ ఛైర్మెన్ బరిలో దింపే దిశగా ప్రధాన పార్టీలు ఆలోచిస్తున్నాయి.

కాంగ్రెస్‌పార్టీ చూస్తే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకే అభ్యర్థులు దొరక్క అల్లాడుతుంది. ఇప్పుడు జడ్పీ ఎన్నికలకు అభ్యర్థులను వెదకడం వారికి పెద్దపనే అవుతుంది. కాంగ్రెస్ నుండి జడ్పీ ఛైర్మెన్‌గా ఇంకా ఎవరి పేరూ తెరమీదకు రాలేదు. తెలుగుదేశం నుండి చూస్తే కోవూరు సీటును పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికిచ్చి, ఆ సీటుకు పోటీలో వున్న పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని జడ్పీ బరిలో నిలపాలనుకుంటున్నారు. అయితే పెళ్లకూరు దీనికి అంగీకరిస్తున్నట్లు లేదు. జడ్పీ ఛైర్మెన్ పదవి ఇస్తామంటే తెలుగుదేశంలోకి తిరిగి వచ్చేందుకు మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి సిద్ధంగా ఉన్నాడు. కాకపోతే ఆయనకు ఆర్థిక సమస్య అడ్డంకి కాగలదు.

వైకాపా నుండి చూస్తే 2006లో ఈ పదవిని ఆశించి కేవలం జడ్పీటీసీకే పరిమితమైన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పేరు ప్రధానంగా వినవస్తుంది. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, గౌతంరెడ్డిలు కూడా రాఘవ పేరునే ప్రతిపాదిస్తున్నారు. మరోపక్క దొరవారిసత్రం మండలానికి చెందిన దువ్వూరు బాలచంద్రారెడ్డి కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కంటే ముందే జడ్పీ ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలోని 46మండలాలు, 46జడ్పీటీసీలలో గెలుపు మూడు పార్టీలకు ప్రతిష్టాత్మకం కాగలదు. ఎవరు జడ్పీ పీఠం దక్కించుకోవాలన్నా 46జడ్పీటీసీలలో కనీసం 24జడ్పీటీసీలు గెలవాలి!

## సమరానికి షెడ్యూల్ ఖరారు

జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు సోమవారం షెడ్యూల్ ఖరారైంది. జిల్లాలో మొత్తం 46జడ్పీటీసీలు, 46ఎంపీపీలు, 583ఎంపీటీసీలకు ఏప్రిల్ 6న పోలింగ్ జరుగనుంది. ఈ నెల 17 నుండి 20 వరకు నామినేషన్ల స్వీకరణ వుంటుంది. 21వ తేదీ నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు. ఏప్రిల్ 6న పోలింగ్ ఉంటుంది. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే 7వ తేదీ ఉంటుంది. 8వతేదీ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. జిల్లాలో మొత్తం 46 జడ్పీటీసీలకు గాను జనరల్‌కు 8, జనరల్ మహిళకు 8, బిసి జనరల్‌కు 7, బీసీ మహిళకు 6, ఎస్సీ జనరల్‌కు 6, ఎస్సీ మహిళకు 6, ఎస్టీ జనరల్‌కు 2, ఎస్టీమహిళకు 3 స్థానాలు కేటాయించారు. అలాగే 46ఎంపీపీలకు సంబంధించి జనరల్‌కు 10, మహిళా జనరల్‌కు 9, బీసీ జనరల్‌కు 7, బీసీ మహిళకు 6, ఎస్సీ జనరల్‌కు 5, ఎస్సీ మహిళకు 5, ఎస్టీ జనరల్‌కు 2, ఎస్టీ మహిళకు 2 స్థానాలు కేటాయించారు. 583 ఎంపీటీసీ స్థానాలలో జనరల్‌కు 105, మహిళాజనరల్‌కు 95, బిసి జనరల్‌కు 85, బీసీ మహిళకు 81, ఎస్సీ జనరల్‌కు 69, ఎస్సీ మహిళకు 85, ఎస్టీ జనరల్‌కు 23, ఎస్టీ మహిళకు 44 స్థానాలు కేటాయించారు. జడ్పీ ఎన్నికల్లో మొత్తం 14,83,304 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 7,30,939 మంది పురుషులైతే, 7,52,365 మంది మహిళా ఓటర్లు కావడం విశేషం.

ఈ ఎన్నికలను బ్యాలెట్ విధానంలోనే నిర్వహిస్తారు. జడ్పీటీసీలకు గులాబీరంగు, ఎంపీటీసీలకు తెలుపురంగు బ్యాలెట్‌లను నిర్ణయించారు. జడ్పీ సిఇఓ జిల్లా ఎన్నికల నోడల్ అధికారిగా ఎంపీడీఓలు ఆయా మండలాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు.

### ఎమ్మెల్యే, ఎంపీ...
## అభ్యర్థులకు అవస్థలు



ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా ఉంది అన్ని పార్టీల ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పరిస్థితి. 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇక ఎలాంటి ఎన్నికలు ఉండవనుకున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా ముగించేసుకోవచ్చనుకున్నారు. ఈమేరకు వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నుండి దాదాపు అన్ని లోక్‌సభ, శాసనసభ స్థానాలకు కూడా అభ్యర్థులను ఖరారు చేసుకుంటూ వచ్చారు. కాంగ్రెస్‌కు మాత్రం అసెంబ్లీ, లోక్‌సభకు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడింది.

అయితే సార్వత్రిక ఎన్నికలకు ముందే మున్సిపల్, పంచాయితీ ఎన్నికలు రావడం అసెంబ్లీ, లోక్‌సభ బరిలో ఉండబోతున్న అభ్యర్థులకు మింగుడు పడడం లేదు. అసలే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలంటే కోట్లుతో కూడుకున్న పని. ఇప్పుడు జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు వారికి అదనపు భారంగా మారాయి. నగరం, పట్టణాల పరిధిలో చూస్తే కార్పొరేషన్, లేదా మున్సిపాల్టీలను గెలుచుకోవడం ప్రధాన రాజకీయపార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారింది. రేపు సార్వత్రిక ఎన్నికలకు వీటి ఫలితాలే కొలమానం కానున్నాయి. అలాగే ఆయా నియోజకవర్గాల పరిధిలో జడ్పీటీసీలు, ఎంపీపీలు అక్కడ పోటీ చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థులకు ముఖ్యం. ఇప్పుడు పార్టీ అభ్యర్థులను అక్కడ గెలిపించుకోగలిగితేనే రేపు అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకా ఉత్సాహంగా పనిచేయడానికి అవకాశముంటుంది. ఓడిపోతే రేపు సార్వత్రిక ఎన్నికలలోనూ అవే ఫలితాలు పునరావృతం కావచ్చు. మధ్యలో వచ్చిన మున్సిపల్ పంచాయితీరాజ్ ఎన్నికలతో అసెంబ్లీ అభ్యర్థులకు తల బొప్పి కడుతుంది. వీటికి అభ్యర్థులను ఎంపిక చేయడం మొదలుకొని ఆర్థికంగా కూడా వారికి సహకరించాల్సి రావడంతో ఈ ఎన్నికలు మా కొంప ముంచడానికి వచ్చాయని తలలు పట్టుకుంటున్నారు.

### • మైనార్టీకి వైకాపా పట్టం
## మేయర్ అభ్యర్థిగా అజీజ్



ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విషయంలో మిగిలిన పార్టీల కంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఓ అడుగు ముందుకేసింది. బి.సి జనరల్ అయిన నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పదవికి తమ పార్టీ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అజీజ్‌ను ప్రకటించింది.

ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ, పొలిట్‌బ్యూరో సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో అజీజ్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం జరిగింది.

అజీజ్ గతంలో నెల్లూరు నగరం సీటు కోసమే ప్రయత్నించారు. పార్టీ కార్యక్రమాలకు బాగానే ఖర్చు చేసారు. అయితే నగర సీటును అనిల్‌కు ఇస్తానని జగన్ గతంలోనే హామీ ఇచ్చి వున్నాడు. దాంతో అజీజ్‌కు అసెంబ్లీ సీటు అవకాశం లేకుండా పోయింది. అసెంబ్లీ కంటే ముందే అనూహ్యంగా మున్సిపల్ ఎన్నికలు రావడంతో అజీజ్‌కు ఈ విధంగా అవకాశం కలిసొచ్చింది.

### తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా
## డాక్టర్ జడ్'యస్'



నెల్లూరు నగరపాలకసంస్థ మేయర్ అభ్యర్థిగా ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను ఖరారు చేయడం జరిగింది. నూనె మల్లిఖార్జునయాదవ్, అంచలవాణి వంటివాళ్లు ఈ అభ్యర్థిత్వం కోసం పోటీపడినప్పటికీ పార్టీలోని ముఖ్య నాయకులైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద రవిచంద్రలు డాక్టర్ జడ్.యస్ వైపే మొగ్గుచూపారు. విద్యావంతుడు కావడం, వైద్య రంగంలోనూ మంచి పేరుండడం, నగరంలో విస్తృత పరిచయాలుండడం వల్ల ఆయన అభ్యర్థిత్వం పార్టీకి కలిసొస్తుందని భావించి మేయర్ అభ్యర్థిగా ఆయనను నిర్ణయించారు. ఈమేరకు 8వ డివిజన్ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా ఆయన బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. డాక్టర్ జడ్‌యస్‌కు ప్రత్యక్ష ఎన్నికల అనుభవం ఇదే! ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాలకే ఆయన పరిమితమవుతూ వచ్చారు. గతంలో ఐఎంఏ అధ్యక్షుడిగా, టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడిగా నెల్లూరు నగరంలో ఎన్నో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు చేరువ కాగలిగారు.

## నెల్లూరుకు జ్ఞానేంద్రరెడ్డి.. ఒంగోలుకు గౌతమ్‌రెడ్డి!





వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున పార్లమెంటు పరిశీలకులను నియమించారు. నెల్లూరు పార్లమెంటు పరిశీలకుడిగా చిత్తూరు మాజీఎంపీ జ్ఞానేంద్రరెడ్డిని నియమించారు. అలాగే ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి గౌతంరెడ్డిని ఒంగోలు పార్లమెంటు పరిశీలకులుగా నియమించారు.

### కిరణ్ వెనుక...



## ఎవరూ లేరు?

మాజీముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి జైసమైక్యాంధ్ర పేరుతో కొత్తపార్టీ పెట్టారు. అయితే జిల్లా నుండి పెద్ద నాయకులెవరూ ఆ పార్టీలో చేరడం లేదు. చిన్నా చితకా నాయకులు మాత్రమే కిరణ్ పార్టీ పట్ల ఆసక్తి చూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులెవరూ కిరణ్ పార్టీ గురించి పట్టించుకోవడం లేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్మెన్, కనీసం మాజీ జడ్పీటీసీ స్థాయి నాయకులు కూడా కిరణ్ పార్టీలోకి పోవాలనుకోవడం లేదు. కిరణ్‌కు సన్నిహితుడనే పేరున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! కిరణ్‌కు సమీపబంధువైన డీసీఎంఎస్ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి కూడా ఇంకా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. కిరణ్ పార్టీలో చేరే విషయమై ఆయన ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. వాకాటి నారాయణరెడ్డి చేరుతారని భావించినా ఆయన వెనుకడుగేసారు.

ఆనం జయకుమార్‌రెడ్డి మాత్రమే కిరణ్ పార్టీలో చేరారు. వాకాటి కాంగ్రెస్‌లోనే కొనసాగే అవకాశాలున్నాయి. విద్యార్థి సంఘం నాయకుడు డి.వి.కృష్ణయాదవ్, దేవెళ్ళ స్వరూప్‌రెడ్డి లాంటివారు పార్టీలో ఉన్నారు. వైకాపా, తెలుగుదేశంలలో టిక్కెట్లు రానివాళ్లు, కాంగ్రెస్ ఎలాగూ దండగనుకుంటున్నారు కాబట్టి కిరణ్ పార్టీలో చేరొచ్చు.

### జగన్ వైపుకు
## మేకల నరేంద్ర



మాజీకార్పొరేటర్ మేకల నరేంద్ర ఈ నెల 10వతేదీన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి గౌతంరెడ్డిల సమక్షంలో ఆయన వైకాపాలో చేరడం జరిగింది.

2006లో జరిగిన నగరపాలక సంస్థ ఎన్నికలలో 23వ డివిజన్ నుండి ఆయన ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. ఆ తర్వాత ఆనం వివేకానందరెడ్డి ప్రోద్భలంతో కాంగ్రెస్‌లో చేరి మేయర్ అభ్యర్థిగా పులిమి శైలజకు మద్దతు తెలిపారు. ఆ తర్వాత వివేకా ముఖ్యఅనుచరులలో ఒకడిగా కొనసాగారు. అయితే ఇటీవల కాలంలో తలెత్తిన పరిణామాలతో ఆయన వివేకాకు దూరమయ్యాడు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు నెంబర్ వన్ అవుతుంది


సమావేశంలో ప్రసంగిస్తున్న దాసరి జైరాంరమేష్

నెల్లూరుజిల్లా పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు తలచుకుంటే రాష్ట్రంలో నెల్లూరు నెంబర్‌వన్ అవుతుందని కేంద్ర మంత్రి దానరి జైరాంరమేష్ చెప్పారు. బుధవారం నెల్లూరులోని ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఇంట్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెల్లూరుకు ఓ ప్రత్యేకస్థానం ఉందని, ఇది రాజకీయ రాజధాని అని అన్నారు. పేరుమోసిన ఎందరో పారిశ్రామికవేత్తలు, మేధావులు, ఐఏఎస్ అధికారులు నెల్లూరువాళ్లేనని, వారంతా దృష్టిపెడితే ఈ జిల్లా స్వరూపమే మారిపోతుందన్నారు. మేకపాటి, లగడపాటి, రాయపాటి లాంటివాళ్లు ఇప్పటివరకు హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టారని, ఇకనుండి వారంతా సీమాంధ్రలో కూడా పెట్టుబడులు పెట్టొచ్చన్నారు. జిల్లాలో దుగరాజపట్నం ఓడరేవు పూర్తయితే పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధించవచ్చన్నారు. వచ్చే జూన్ 2 నుండి సీమాంధ్రకు ప్రత్యేక ప్రతిపత్తి వస్తుందన్నారు. సీమాంధ్రకు కేంద్రం ఇచ్చే నిధులలో 90శాతం గ్రాంట్‌గా 10శాతం ఋణంగా ఉంటుందన్నారు. తెలంగాణకు 70శాతం గ్రాంట్, 30శాతం ఋణంగా ఇవ్వామన్నారు. రాష్ట్ర విభజనతో సీమాంధ్రకే లాభమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల బలమే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష

**- కాకాణి**


వైయస్సార్సీపీలో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలం పోట్లపూడి గ్రామంలో ఈనెల 11న దాదాపు 100మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సర్వేపల్లి వైఎస్సార్సీపి సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ కార్యకర్తల బలమే తమ పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. కార్యకర్తల వెనుక ప్రజాబలం దండిగా వుందని, వైఎస్‌జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలు ఏనాడో నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. చిత్తూరు మాజీఎంపీ జ్ఞానేంద్రరెడ్డి, పార్టీ తిరుపతి పార్లమెంటు పరిశీలకులు వరప్రసాద్, విజయడెయిరీ మాజీ ఛైర్మెన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నెల్లూరులో మహాలక్ష్మీయాగం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీరామచంద్రజీయర్ స్వామి


నెల్లూరు దర్గామిట్టలోని ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న 'మహాలక్ష్మీ యాగం' ఏర్పాట్లను భాష్యకార పీఠం అధిపతులు పరివ్రాజకాచార్య శ్రీరామచంద్రజీయర్ స్వామి ఈ నెల 13న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భిక్షాటనా పూర్వకంగా ఈ యాగాన్ని నెల్లూరులో నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ప్రతిరోజూ యాగస్థలంలో శ్రీమహాలక్ష్మి, భూదేవి సమేత నారాయణ స్వామికి తిరుమంజనం, అర్చన, శాత్తుమొర, తీర్థగోష్టి నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు చక్రవర్తి, నాగారెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, తోట మనోహర్, యం.కృష్ణారెడ్డి, నారాయణ, ఎం.పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# 49వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలు

నెల్లూరులో ప్రతిఏటా క్రమం తప్పకుండా నిర్వహించే భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు ఈ నెల 21 నుండి 27వరకు టౌనుహాలు ఆవరణలో వైభవంగా జరుగనున్నాయి. 2013నవంబరు నుండి 2014 ఫిబ్రవరి వరకు నగరంలో భిక్షాటన చేసి తద్వారా లభించిన నగదు, వదాన్యుల సహకారంతో వారంరోజుల పాటు ఈ సంగీతోత్సవాలు జరుగుతాయి. కీర్తిశేషులు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, డా॥ యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రిలు 49ఏళ్ల క్రిందట ప్రారంభించిన ఈ ఉత్సవాలు సంగీతసరస్వతి త్యాగరాజ స్వామిపై భక్తితో ఏటికేటికి మీదు మిక్కిలి ఉత్సాహంతో జరుపుతుండడం విశేషం. నెల్లూరులోని ఔత్సాహిక గాయకులతో పాటు చెన్నైలోని శాస్త్రీయసంగీత నిష్ణాతులు ఈ స్మరణోత్సవాలలో తమ గాత్రాలతో, వాయిద్యాలతో మహనీయ వాగ్గేయకారుడు శ్రీ త్యాగరాజుని స్మరిస్తూ ఆబాలగోపాలాన్ని ఆనందడోలికల్లో ఓలలాడించడం జరుగుతోంది. 21న నెల్లూరుకు చెందిన జె.వి.యస్.ఆర్.ఎస్.ప్రసాద్ అండ్ పార్టీ, 22న చెన్నైకు చెందిన దినేష్‌కుమార్ అండ్ పార్టీచే వాద్యసమ్మేళనం, 23, 24, 25, 26 తేదీల్లో చెన్నైకు చెందిన సిక్కిల్ గురుచరణ్ అండ్ పార్టీ, సాతూరు సిస్టర్స్ అండ్ పార్టీ, అమృతమురళి అండ్ పార్టీ, తోపూరు బి.సాయిరామ్ అండ్ పార్టీలచే గాత్రకచేరీలు వుంటాయి.

**• జడ్పీకి...**

# సిద్ధమవుతున్న అభ్యర్థులు




➤ **వైకాపా నుండి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి**

➤ **దేశం నుండి కంభం విజయరామిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి**




*వివాహ వేడుకల్లో భోజనాలప్పుడు ఒక బంతి లేవగానే ఇంకో బంతికి విస్తర్లు వేస్తుంటారు. ఇప్పుడు ఎన్నికల కమీషన్ పని కూడా అలాగే ఉంది. మున్సిపల్ ఎన్నికల తంతు పూర్తికాగానే పంచాయితీరాజ్ ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాల్సివుంది. ఎన్నికల సంఘమే కాదు, రాజకీయపార్టీల పరిస్థితి కూడా ఇంతే.*

జడ్పీ ఎన్నికల నేపథ్యంలో ఛైర్మెన్ అభ్యర్థుల ఎంపికపై పార్టీలు దృష్టిపెట్టాయి. ఎన్నికలంటే ఎంతో ఉత్సాహం చూపుతున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జడ్పీ ఎన్నికలపై దృష్టిపెట్టింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ అభ్యర్థులను ఖరారుచేసే పనిలో నిమగ్నమై ఉంది. వైకాపా తరపున ఛైర్మెన్ అభ్యర్థులుగా గూడూరు నియోజకవర్గానికి చెందిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆత్మకూరుకు చెందిన బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. గూడూరు నియోజకవర్గానికి చెందిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడు. పార్టీని స్థాపించిన తొలినాళ్లలోనే పార్టీలో చేరిన శ్యాం పార్టీ కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొంటున్నారు. పార్టీ కోసం తన సొంతడబ్బునే ఖర్చు చేసుకుంటున్నాడు. శ్యాంను జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా ప్రకటించాలని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టుదలతో వున్నాడు. అయితే మరోపక్క మేకపాటి సోదరులు మాత్రం బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని ఛైర్మెన్ అభ్యర్థిగా ప్రకటించాలని చూస్తున్నారు. మేకపాటి గౌతంరెడ్డి పోటీ చేయబోతున్న ఆత్మకూరు నియోజకవర్గంలో గౌతంకు రాఘవ గట్టి మద్దతుదారుగా ఉన్నారు. గౌతం లేనప్పుడు కూడా ఇక్కడ రాఘవనే పార్టీ కార్యక్రమాలు చూస్తుండేవాడు. ఇప్పటివరకు నియోజకవర్గంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గట్టిగా ఢీకొంటూ వచ్చింది రాఘవ మద్దతుతోనే! ఆయనను జడ్పీ ఛైర్మెన్‌ను చేస్తే రేపు అసెంబ్లీ ఎన్నికల్లో గట్టిగా పోరాడవచ్చనేది మేకపాటి సోదరుల ఆలోచన.

కాంగ్రెస్ నుండి జడ్పీ ఛైర్మెన్ పేరు బయటకు రాలేదుగాని, తెలుగుదేశం నుండి కంభం విజయరామిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డిల పేర్లు వినవస్తున్నాయి. కంభం ఇటీవలే తెలుగుదేశం నుండి కాంగ్రెస్‌లోకి పోయారు. మళ్లీ తెలుగుదేశంలోకి వస్తున్నారు. ఉదయగిరిలో మేకపాటిని అడ్డుకోవాలంటే కంభం అండ అవసరం. అందుకే జడ్పీ ఛైర్మెన్ పదవి ఇస్తామని ప్రతిపాదించి ఆయనను తిరిగి పార్టీలోకి చేర్చుకుంటున్నట్లు తెలుస్తుంది. మరోపక్క వేనాటి రామచంద్రారెడ్డి కూడా జడ్పీ ఛైర్మెన్ రేసులో ఉన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఇంతవరకు ఆయన తెలుగుదేశాన్ని విడిచిపెట్టలేదు. పదవులు రాకపోయినా పార్టీ కోసం పనిచేస్తున్నాడు. పార్టీలోని ఓ వర్గం ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తుంది.

మొత్తానికి వైకాపా, తెలుగుదేశంలలోనే జడ్పీ ఎన్నికల సందడి కనిపిస్తుంది. కాంగ్రెస్‌లో ఆ ఊసేలేదు.

# స్వేచ్ఛగా ఓటును వినియోగించుకోండి



చైతన్య సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రం ఆడిటోరియంలో ఈనెల 12న జరిగిన గిరిజన గ్రామ ఓటర్ల చైతన్య సదస్సులో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధానంగా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఓటు అనే ఆయుధంతో నిస్వార్థంగా, స్వేచ్ఛగా సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో గిరిజన ప్రాంత ప్రజలు ఓటు హక్కుపై అవగాహన కలిగి డబ్బుకు, మద్యానికి, తదితర ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎవరైనా అభ్యర్థులు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 100లేదా 1050కు ఫోన్‌చేసి సమాచారం తెలియజేయవచ్చన్నారు. సమావేశంలో అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.యస్.రాజ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు ఇ.వి.యస్.నాయుడు, గిరిజన సంఘనాయకురాలు మల్లిక శైలజ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నారాయణ, వివిధ గ్రామాల నుంచి గిరిజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అజీజ్‌కు ముస్లిం మతపెద్దల అభినందన


అబ్దుల్ అజీజును అభినందిస్తున్న ముస్లిం మతపెద్దలు

నెల్లూరు హరనాథపురంలోని హాజీఅబ్దుల్ అజీజ్ ట్రస్ట్ కార్యాలయంలో ఈనెల 11న అబ్దుల్ అజీజ్‌కు వైఎస్సార్సీపీ నెల్లూరు నగర మేయర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన సందర్భంగా ముస్లిం మతపెద్దలు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లిం మత పెద్ద హల్‌అజ్‌షేక్ ముక్తిమహ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ స్వతంత్ర్య భారతదేశంలో మైనార్టీలకు 60ఏళ్ళ తర్వాత వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ వల్ల గుర్తింపు లభించిందన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తే, ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి నగర మేయర్ అభ్యర్థిత్వాన్ని ముస్లింలకు ఇవ్వడం ఆనందంగా వుందన్నారు. తదుపరి నగర మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్ రషీద్, మౌలానా అబ్దుల్ రవూఫ్, మౌలానా జలాల్, మౌలానా సుభాన్, మౌలానా ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.


**నోటీసు**

**IN THE COURT OF THE PRINCIPAL DIST. JUDGE, GUNTUR**

**M.V.O.P. No. 118/2012**

Shaik .....  .....Petitioner

And


T. Padmavathi & Another  ....Respondents

**To.: R-1:** T. Padmavathi W/o. Srinivasa Rao, (Owner of Bus No. AP 26Y9899) R/o. D.No. 24-2-1005, Ramanagar, Durgametta, Nellore Dist.

ఈ నెంబరు OP లోని పిటీషనర్‌కు యాక్సిడెంట్‌లో కలిగిన గాయాలకు నష్టపరిహారం కోరుతూ OPలో 1వ రెస్పాండెంట్ అయిన మీకు అనేక పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయించవలసినదిగా పైకోర్టువారు ఆర్డరు వేస్తు ది. 19-03-2014నకు వాయిదా చేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం. 10-30 ని॥లకు స్వయముగా గానీ, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ వరోక్షమున విచారించి తీర్మానించబడును.

**ఎస్. కాలేష**

**పిటీషనరు తరుపు న్యాయవాది, గుంటూరు.**




## అధికారంలో నిజాయితీగా ఉండాలి

ఎన్నికల పుణ్యమా అంటూ సంవత్సరాల తరబడి ఒకే చోట తిష్ఠ వేసిన అధికారులు బదిలీ కావడం మంచిదే! చాలామంది అధికారులు పైకి నీతిమంతులుగా నటిస్తూ లోలోన అవినీతి కార్యక్రమాలు సాగిస్తుంటారు. బదిలీపై వచ్చిన అధికారులు నిజాయితీతో సమర్థవంతంగా పని చేయాలి. రేపటి ఎన్నికలలో నిజాయితీగా పనిచేయాలి. అపరిష్కృత అర్జీలను పరిష్కరించాలి. జిల్లా అంతటా మంచి వాతావరణాన్ని నెలకొల్పాలి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## శభాష్ కేసీఆర్

కేసీఆర్ నిజంగా అభినందనీయుడే. కాంగ్రెస్‌కు బుద్ధి వచ్చేలా చేసాడు. కేసీఆర్ పార్టీ టీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవడం కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని హతమార్చింది. ఇప్పుడు అదే కేసీఆర్ కాంగ్రెస్‌కు హ్యాండిచ్చాడు. మొన్నటివరకు కేసీఆర్‌ను తిట్టుకున్న సీమాంధ్రులు ఇప్పుడు మెచ్చుకుంటున్నారు. కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాడని ప్రశంసిస్తున్నారు. సీట్లు, ఓట్ల కోసం దుర్బుద్ధితో పాడు రాజకీయాలు చేయకూడదని కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది. అయినా కాంగ్రెస్ వారి బుద్ధి కుక్క తోకే కదా!

జి.ఎస్.రావు, నెల్లూరు.

## వింతకళ్ళు

కొండముచ్చు బర్త్‌డే పార్టీకి చాలా జంతువులు, పక్షులు హాజరయినాయి. అక్కడ చేరిన ఒంటెలు, గాడిదలు మీరెంత అందంగా ఉన్నారంటూ ఒకరినొకరు పొగడ్తలతో ముంచెత్తుకున్నారు. అలావుంది 15వ లోక్‌సభలో కాంగ్రెస్ బీజేపీల పొగడ్తల పర్వం. సుష్మా కళ్ళకు సోనియా మొండితనంలో హుందాతనం, ప్రధాని చేతగానితనంలో మృదుత్వం కనిపించాయి. నిత్యం సభలో సుష్మా చేత తిట్లు తిన్న షిండేకు సుష్మా గొంతు కోయిల కంఠస్వరంలా అనిపించింది.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## 'ప్రభా'తం

సంక్రాంతి, దీపావళి, క్రిస్మస్, హోలీ, రంజాన్, విజయదశమి... ఈ పండుగలతో పాటూ ఈ ఏడాది దేశానికి ఓట్ల పండుగ కూడా వచ్చింది. దేశ భవిష్యత్‌ను నిర్ణయించబోయే 16వ సార్వత్రిక ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. మొత్తం 9దశల్లో దేశంలోని 543లోక్‌సభ స్థానాలకు అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిసా, సిక్కిం అసెంబ్లీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో దేశమంతా కూడా రాజకీయసెగలు రేగుతున్నాయి. అధికారమే లక్ష్యంగా ప్రధానపార్టీలు కూటములుగా గ్రూపు కట్టి ముందుకు కదులుతున్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నరేంద్రమోడీ అన్ని రాష్ట్రాలనూ ఓ చుట్టు చుట్టేసాడు. కాంగ్రెస్ తురుపుముక్క రాహుల్‌గాంధీ ప్రచారంలో ఆపసోపాలు పడుతున్నాడు. ఇక మూడోకూటమి, నాలుగోకూటమి అనేవి కూడా తెరమీదకొస్తున్నాయి. తాజాగా జయలలిత, మమతాబెనర్జీ, మాయావతిలు ఒకేతాటి మీదకొచ్చి ప్రధానిగా తమలో ఒకరుండాలనే దానిపై ఒప్పందానికి వచ్చినట్లు తెలుస్తుంది.

## ఓట్ల పండుగ



ముస్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద జరుగుతాయి. తమ పార్టీ బండారం బయట పడుతుందేమోననే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఎన్నికలు పెట్టకుండా ఇంత కాలం నెట్టుకుంటూ వచ్చింది. అయితే ఈరోజు సుప్రీంకోర్టు గుడ్లురమడంతో ఎన్నికలకు సమాయత్తం కాక తప్పడం లేదు.

దేశంలోని మిగిలిన రాష్ట్రాలన్నీ లోక్‌సభ ఎన్నికల మీదే దృష్టి పెట్టివుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం ఏర్పడింది. రాష్ట్రంలో ఎన్నికల తిరునాళ్ళు, ఓట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని చెప్పుకోవచ్చు. ఓ పక్క 16వ లోక్‌సభ ఎన్నికలు, దాంతో పాటే రాష్ట్ర శాసన సభ ఎన్నికలు వచ్చాయి. అధికార యంత్రాంగం ఆ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో ఉండగానే సుప్రీంకోర్టు మరో రెండు బాంబులను అధికారులు మరియు రాజకీయపార్టీల నెత్తిన పడేసింది. కొన్నేళ్ళుగా రాష్ట్రప్రభుత్వం వాయిదాలమీద వాయిదాలేసుకుంటూ వచ్చిన మున్సిపల్ మరియు జడ్పీ ఎన్నికలను కూడా సార్వత్రిక ఎన్నికల లోపే నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో అధికార యంత్రాంగానికి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. సార్వత్రిక ఎన్నికల మూడ్‌లో వున్న వివిధ రాజకీయపార్టీలకైతే సుప్రీం తీర్పు ఒక ప్రహసనంగా మారింది. రాష్ట్రంలో ఏక కాలంలో మున్సిపాల్టీ, జడ్పీ, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల వాతావరణం నెలకొంది. ఒకరకంగా మార్చి నుండి మే నెలాఖరు వరకు అధికారులకు, రాజకీయ నాయకులకు, ప్రజలకు రెండో పని లేకుండాపోయింది. నామినేషన్లు, ప్రచారాలు, పోలింగ్, కౌంటింగ్, గెలిచిన అభ్యర్థుల ప్రమాణస్వీకారాలు, కొత్త ప్రభుత్వాల ఏర్పాటు... ఈ మూడు నెలలు ఎన్నికల వాతావరణంతోనే గడిచిపోనున్నాయి. ఒకేసారి నాలుగురకాల ఎన్నికలకు సన్నద్ధం కావడం అధికారులకు కత్తిమీద సాముగానే ఉంది. నిర్ణీత కాలంలో ప్రతిదానికీ ఎన్నికలు నిర్వహించుకుంటూ పోయివుంటే ఒకేసారి ఇంత ఒత్తిడి ఉండేది కాదు. కాని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేయడమే పనిగా పెట్టుకుంటూ పోయింది. గత పదేళ్ల నుండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వుంది. మొదటి ఐదేళ్ల కాలంలో పంచాయితీలు, సహకారం, మున్సిపల్స్, జడ్పీ ఎన్నికలను సకాలంలో నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేసారు. కారణం మొదటి ఐదేళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నది దివంగత నేత డాక్టర్ వైయస్.రాజశేఖరరెడ్డి కాబట్టి. కాంగ్రెస్‌పార్టీని గెలిపించగలననే ధీమా ఆయనలో అణువణువూ కనిపించేది. ఎలాంటి ఎన్నికలలోనైనా తెలుగుదేశాన్ని ఒంటిచేత్తో మట్టికరిపించి, ఈ రాష్ట్రంలో ప్రధానప్రతిపక్షం ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాడాయన. 2009లో తిరిగి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొద్దిరోజులకే వైయస్. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. దీంతో కాంగ్రెస్‌పార్టీలో ఎలక్షన్లు నడిపే మొనగాడే లేకుండాపోయాడు. 2010లో మున్సిపాల్టీ, 2011లో జడ్పీ ఎన్నికలను జరపాల్సి ఉండేది. కాని ఆ ఎన్నికలను జరిపే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు లేకుండాపోయింది. వైయస్. తర్వాత ఏడాదికాలం ముఖ్యమంత్రిగా వెలగబెట్టిన రోశయ్య గాని, ఆ తర్వాత వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి గాని ఈ ఎన్నికల జోలికే పోలేదు. ఎందుకంటే పార్టీని గెలిపించే సత్తా వారికి లేదని అర్థమైపోయింది. దీనికితోడు వైయస్ లేని రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ కుక్కలు చింపిన విస్తరిలా మారింది. ఓటమి భయంతోనే పంచాయితీరాజ్ ఎన్నికలను వాయిదాలమీద వాయిదాలు వేస్తూ వచ్చారు. ఏడాది క్రితం సహకార ఎన్నికలను కొన్ని నెలల క్రితమే పంచాయితీల ఎన్నికలను నామమాత్రంగా ముగించారు. వైకాపాను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్, తెలుగుదేశంలు మ్యాచ్‌ఫిక్సింగ్‌కు పాల్పడి ఆ ఎన్నికలలో కొంత పరువు దక్కించుకోగలిగాయి.

కాని జడ్పీ, మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుల మీద జరుగుతాయి. తమ పార్టీ బండారం బయటపడుతుందేమోననే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం వాటి ఎన్నికలు పెట్టకుండా ఇంతకాలం నెట్టుకుంటూ వచ్చింది. అయితే ఈరోజు సుప్రీంకోర్టు గుడ్లురమడంతో ఎన్నికలకు సమాయత్తం కాక తప్పడం లేదు.

రాష్ట్రంలో 42లోక్‌సభ, 294శాసనసభ స్థానాలు, ఇక కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలు, 22జిల్లా పరిషత్‌లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు... ఒకేసారి వీటన్నింటికి ఎన్నికలు. దండుకున్నోడికి దండుకున్నంత అన్నట్లు ఓట్లమ్ముకునేవాళ్లకు ఈ మూడునెలలు మంచి మార్కెట్టే!

## 'అంతర్'జాతీయం

- అయోధ్యలోని వివాదాస్పద స్థలంలోని తాత్కాలిక ఆలయం వద్ద పాత టార్పాలిన్, తాళ్లను తీసివేసి కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ వివాదానికి సంబంధించి కేంద్రం, ఇతర పార్టీలు అభ్యంతరం తెలపకపోవడంతో ధర్మాసనం అనుమతి మంజూరు చేసింది.
- దేశ వ్యాప్తంగా మరో 30పౌరవిమానాశ్రయాల రక్షణ బాధ్యతలను కేంద్ర పారిశ్రామిక దళం చేపట్టనుంది. ఇప్పటికే సిఐఎస్ఎఫ్ 59విమానాశ్రయాలకు భద్రత కల్పిస్తుంది. ఉగ్రవాద హెచ్చరికల నేపథ్యంలో సిఐఎస్ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది.
- ఎన్నికల ర్యాలీలలో జాతీయ జెండా వినియోగంపై నిషేధమేమీ లేనప్పటికి జెండా గౌరవానికి ఏ మాత్రం భంగం కలుగని రీతిలో రాజకీయ పార్టీలు వ్యవహరించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.
- గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీకి వీసా ఇచ్చే విషయంలో అమెరికా వైఖరి మారలేదని ఒబామా పరిపాలనాధికారి స్పష్టం చేసారు. వీసా కోసం మోడీ దరఖాస్తు చేసుకోవచ్చుని సాధారణ ప్రక్రియలోనే దానిని పరిగణనలోకి తీసుకుంటామని ఆయన వెల్లడించారు.
- భారత్‌లోని ఇంజనీరింగ్‌విద్యకు అంతర్జాతీయ గుర్తింపు లభించనుంది. వాషింగ్టన్ ఒప్పందంలో భారత్‌కు పూర్తిస్థాయి సభ్యత్వం కల్పించేందుకు రంగం సిద్ధమైంది. 1989లో 16దేశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్య గుర్తింపు సంస్థలు ఈ ఒప్పందంపై సంతకం చేసాయి. 2007 నుండి భారత్‌కు ఇందులో తాత్కాలిక సభ్యత్వం ఉంది. ఈ ఏడాది జూన్ నుండి పూర్తిస్థాయి సభ్యత్వం రానుంది.
- ఎవరి మీదైనా ఐదు సంవత్సరాలకు మించి శిక్షపడే నేరాలకు పాల్పడినట్లు కోర్టులో అభియోగాలుంటే అటువంటి వ్యక్తులను ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని న్యాయకమీషన్ అభిప్రాయపడింది. నేరగాళ్లను రాజకీయాలలోకి రాకుండా అడ్డుకోవడానికి ఇదే సరైన విధానమని పేర్కొంది.
- ఆధార్ సృష్టికర్త, ఐటీ దిగ్గజం నందన్ నిలేకని కాంగ్రెస్‌పార్టీలో చేరారు. బెంగుళూరు నుండి ఢిల్లీకి సమర్థవంతమైన ఛాంపియన్‌గా నిలుస్తానని ఆయన చెప్పుకొచ్చారు.
- న్యూయార్క్ నగరంలో ట్యాక్సీలు, అద్దె రవాణా వ్యవస్థను నియంత్రించే సంస్థకు భారత సంతతి మహిళ మీరాజోషి ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. మీరా నియామకాన్ని ట్యాక్సీ వర్కర్స్ యూనియన్‌లు స్వాగతించాయి.
- ఆఫ్ఘనిస్థాన్ ఇద్దరు ఉపాధ్యక్షులలో ఒకడైన మార్షల్ మొహమ్మద్ ఖాసింఫాహిం ఈ 9న మరణించారు. అనారోగ్యంతోనే ఆయన చనిపోయినట్లు అధ్యక్షుడు హామీద్ కర్జాయ్ తెలిపారు.

## వార్త వ్యాఖ్య

| | | |
|---|---|---|
| వార్త | :- | విలువలపై ఆయనా మాట్లాడేది? – జగన్‌పై చంద్రబాబు ధ్వజం. |
| **వ్యాఖ్య** | **:-** | ***మరి మీరు మాట్లాడొచ్చా?*** |
| వార్త | :- | ఎన్నికలకు ఒంటరిగా వెళదాం. – టీ-కాంగ్రెస్‌నేతల అభిప్రాయం. |
| **వ్యాఖ్య** | **:-** | ***పొత్తుంటే సగం టిక్కెట్లు రావనా?*** |
| వార్త | :- | బీసీలను కాంగ్రెస్ మోసం చేసింది. – ఆర్.కృష్ణయ్య. |
| **వ్యాఖ్య** | **:-** | ***బీసీలనేంటి, దేశాన్నే మోసం చేసారు.*** |
| వార్త | :- | కొత్తపార్టీలతో ఒరిగేదేమీ ఉండదు. – కేంద్రమంత్రి పళ్లంరాజు. |
| **వ్యాఖ్య** | **:-** | ***నూటపాతికేళ్ల వయసున్న ముసలి కాంగ్రెస్‌తో మాత్రం ఏం ఒరిగింది.*** |
| వార్త | :- | భాజపాతోనే సీమాంధ్ర అభివృద్ధి. – వెంకయ్యనాయుడు. |
| **వ్యాఖ్య** | **:-** | ***విడగొట్టింది అందుకేనా?*** |
| వార్త | :- | ప్రధానిగా మోడీ అత్యవసరం. – విజయవాడలో యశ్వంత్ సిన్హా. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఒక గంట కూడా ఓపిక పట్టేట్లు లేరే!*** |
| వార్త | :- | తెలుగువారిని మళ్ళీ ఒక్కటి చేస్తా! – నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఎందుకొచ్చిన తలనొప్పి... విడిపోయినట్లే వుండనియండి.*** |
| వార్త | :- | మోడీ ప్రధాని కాకుండా లౌకికశక్తులు అడ్డుకోవాలి. – లాలూ. |
| **వ్యాఖ్య** | **:-** | ***చింత చచ్చినా మీలో పులుపు చావలేదు.*** |
| వార్త | :- | కొత్త పార్టీలతో కాంగ్రెస్‌కు నష్టం లేదు. – పనబాక లక్ష్మి. |
| **వ్యాఖ్య** | **:-** | ***చచ్చినవాణ్ణి ఇంకెవరూ చంపలేరనేగా...*** |
| వార్త | :- | తెలంగాణకు దళితుడినే సీఎం చేస్తాం. – జైరాంరమేష్. |
| **వ్యాఖ్య** | **:-** | ***టీ-బిల్లు పెట్టకముందు మీరు ఈ మాట చెప్పివుంటే మీ నాయకులే తెలంగాణ వద్దనేవాళ్లు.*** |
| వార్త | :- | సీమాంధ్రలో పార్టీ పుంజుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. – రాహుల్‌తో మంత్రి ఆనం. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఓ రెండు, మూడు దశాబ్దాలు పట్టొచ్చా?*** |
| వార్త | :- | కాంగ్రెస్‌ను గోదావరిలో కలిపేందుకే జైరాం పర్యటన. – ఉండవల్లి. |
| **వ్యాఖ్య** | **:-** | ***కాంగ్రెస్ మీద గతంలో ఏదన్నా పగ వుందేమో!*** |

# ఎన్నికలకు సన్నద్ధంగా ఉండండి


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ రేఖారాణి

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఇవిఎంలు మరియు నామినేషన్ తదితర విషయాలపై ఎన్నికల కమీషనరేట్ కార్యాలయపు డైరెక్టర్ వి.ఎన్.శుక్లా ఈనెల 10న వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఆయా జిల్లాల పరిధిలో వున్న ఇవిఎంలకు సంబంధించిన సమాచారం నిర్దేశించిన సాఫ్ట్‌వేర్‌లో పొందుపరచి సిద్ధంగా వుంచుకోవాలన్నారు. వాటి యొక్క క్వాంటిటి, కోడ్‌లు సాఫ్ట్‌వేర్‌లో పొందుపరచాలన్నారు. అలాగే నామినేషన్‌కు సంబంధించిన అభ్యర్థనలు, నిర్దేశాలు ప్రోఫార్మాలో ఎన్నికల నియమావళిననుసరించి వేసేలా చూడాలన్నారు. నామినేషన్ సమయంలో ఆ అభ్యర్థులు ఏ పార్టీకి చెందిన వారు, ఇండిపెండెంట్‌గా వేస్తున్నారా అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిబంధనల మేరకు నిర్వహించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇసిసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్‌శర్మ, జాయింట్ కలెక్టర్ జి.రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌తోనే జనం కోరిన పాలన

**- అనిల్‌కుమార్‌యాదవ్**


ఊటుకూరు మాధవరావును వైయస్సార్సీపీలోకి ఆహ్వానిస్తున్న డా॥ అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు యనమల వారి దిన్నెలో ఈనెల 9న 13వ డివిజన్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని వైఎస్సార్సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త డా॥పి. అనిల్ కుమార్‌యాదవ్ ప్రారంభించారు. వైఎస్సార్సీపీలోకి చేరాలని వచ్చిన ఆ ప్రాంతానికి చెందిన ఊటుకూరు మాధవరావు తదితరులను పార్టీ కండువా కప్పి అనిల్‌కుమార్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు తొమ్మిది ఏళ్ళ నరకాన్ని చూపిన చంద్రబాబునాయుడు పాలన నుంచి డా॥వై.యస్.రాజశేఖరరెడ్డి విముక్తి ప్రసాదించారని అన్నారు. వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు రూ॥70/-లు వున్న ఫించన్‌ను రూ॥200లకు పెంచడమే కాక పేద ప్రజలకు సంజీవనిలాంటి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి ఎందరికో ప్రాణదానం చేసిన ఘనత వైఎస్సార్‌దేనని పేర్కొన్నారు. తండ్రిలాగే పేద ప్రజల జీవితాలను దగ్గరగా చూసిన తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరి దీవెనతో ముఖ్యమంత్రి అయితే రాజన్న సువర్ణపాలనను తిరిగి ప్రజలకు అందిస్తారని అన్నారు. పీఆర్పీ పార్టీలో గెలిచిన నగర ఎమ్మెల్యే మూడురోజులకే కాంగ్రెస్ పార్టీతో జతకట్టి, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఎప్పుడూ తమ కుటుంబం ఆర్థి కంగా ఎదిగేందుకే కృషిచేసాడని మాజీ నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 90ఓట్లతో మాత్రమే ఓటమిని చవిచూసినా ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న తనని అలాగే కార్పొరేషన్ ఎన్నికల్లో 13వడివిజన్ వైఎస్సార్సీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దయాకర్, మురళీ, నవకోటమణి, శీనయ్య, నాగార్జున, దార శీనయ్య, కమతం హరి తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ టెస్టులో శ్రీ నేతాజీ విద్యార్థి శశాంక్


అభినందనలందుకుంటున్న శశాంక్

10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో యస్‌యఫ్‌ఐ వారు ఇటీవల నిర్వహించిన మోడల్ టెస్ట్ ఫలితాలలో శ్రీ నేతాజీ పైలట్ హైస్కూలు విద్యార్థికి జిల్లా మొదటి బహుమతి వచ్చినట్లు స్కూలు కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి ఈనెల 8న ఒక ప్రకటనలో తెలిపారు. యస్‌యఫ్‌ఐ వారు 100మార్కులకు నిర్వహించిన మోడల్ టెస్టునందు తమ పాఠశాల విద్యార్థి టివియల్ శశాంక్ 97మార్కులతో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారని, 85మార్కులతో ఇద్దరు విద్యార్థినులు కె.నిఖిల, పి.యామిని, మరియు 82మార్కులను ఆర్.మహిధర్ సాధించినట్లు తెలుపుతూ అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల డైరెక్టరు నరేంద్రరెడ్డి అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను అభినందిస్తూ పట్టుదలతో చదివి రాబోవు ప్రీపబ్లిక్ మరియు పబ్లిక్ పరీక్షలను వ్రాసి ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలిపారు. హెడ్‌మిస్ట్రస్ యన్.ప్రసన్న, వైస్ ప్రిన్సిపాల్ డి.వాణి, హెడ్మాస్టరు వి.సుధాకరరావు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆదరిస్తే అందుబాటులో ఉంటా!

**➤ వైఎస్సార్సీపీలో చేరిన కాంగ్రెస్, టిడిపి నాయకులు**

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**


మేకపాటి సమక్షంలో వైకాపాలో చేరుతున్న పి.వీరారెడ్డి తదితరులు


నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని అయ్యప్పగుడి వద్ద ఉన్న రాధా కృష్ణ కళ్యాణమండపంలో కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీల నాయకులు, మాజీ కార్పొరే టర్‌లు ఈనెల 9న నెల్లూరురూరల్ సమ న్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వై.యస్.ఆర్.కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేరిగ మురళీ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పడారుపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పాత పాటి ప్రభాకర్‌రెడ్డి (పుల్లారెడ్డి), సిద్దార్థ స్కూల్ అధినేత సురేష్ రెడ్డి, బివినగర్ ప్రాంత ప్రముఖ నాయకులు యనమల వీరారెడ్డి, వేదాయపాళెం తెలుగుదేశం నాయకులు యం.పి కృష్ణారెడ్డి, హరనాథ పురం కాంగ్రెస్ నాయకులు మారంరెడ్డి కుమార్, మోహన్‌రావు, మాజీ కార్పొరే టర్‌లు రావులపల్లి వెంకటజ్యోతి, సూళ్లూరు దేవరాజులు, సూళ్లూరు రమా దేవి తదితరులు తమ అనుచరులతో వై.యస్.ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

నెల్లూరు రూరల్ ఎం.ఎల్.ఏ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజ లందరూ తనను ఆదరించి ఎం.ఎల్.ఏగా గెలిపిస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని 30సం॥ల నుంచి ప్రజా సమ స్యలపై పోరాటం చేస్తున్నానని అదే విధంగా ఎం.ఎల్.ఏగా గెలిపిస్తే ప్రజా సమస్యలు పరిష్కరించటానికి కృషిచేస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఆత్మకూరు సమన్వయకర్త మేకపాటి గౌతంరెడ్డి, రాష్ట్ర సిఈసి సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర కోఆర్డినేటర్ డా॥పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, నగర కన్వీనర్ ఆనం వెంకటరమణారెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పిగిలాల నరేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు తాటి వెంకటేశ్వరరావు, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, యన్‌డి సలీమ్‌అహ్మద్, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదాత సోమిశెట్టి



నెల్లూరులోని ఎన్‌డిఆర్ లేఅవుట్‌లో నివసిస్తున్న సోమిశెట్టి వెంకటరత్నం(84) ఈనెల 10న మరణించారు. కుటుంబసభ్యుల సహకారంతో ఆయన కోరిక మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని, అర్బన్ ఆర్యవైశ్య యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డా॥ పి.ఎల్.రావు కంటి ఆసుపత్రి ఐ బ్యాంక్ టెక్నీషియన్ యండిబి ప్రసాద్ నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ మాట్లాడుతూ నేత్రదాత సోమిశెట్టి వెంకటరత్నపత్నం భార్య సుబ్బరత్నమ్మ నేత్రాలు దానం చేసారని ఇదెంతో స్వార్థరహిత సేవ అని కొనియాడారు. వారి కుటుంబసభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సోమిశెట్టి పిచ్చయ్య, బి.పార్థ సారథి, అయిత భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. నేత్రదానం చేయాలనుకునేవారు ఐ డొనేట్ మోటివేటర్ బయ్యాప్రసాద్‌ను 9700416822లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# పరీక్ష తేదీలు మారాయి

ఎన్నికల దెబ్బకు డిగ్రీ పరీక్షల తేదీలు మారాయి. ఈ నెల 19 నుండి డిగ్రీ పరీక్షలు మొదలుకావాల్సి వుండింది. అయితే ఎన్నికల దృష్ట్యా ఏప్రిల్ 4వ తేదీ నుండి ప్రథమ, తృతీయ సంవత్సర డిగ్రీ పరీక్షలు ఏప్రిల్ 9వ తేదీ నుండి ద్వితీయ సంవత్సర పరీక్షలు మొదలవుతాయి.

**• సీపీఎం**

# ఒంటరిగా పోరాడితే పోయేదేముంది

నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలు, నాయుడుపేట నగరపంచాయితీలలో సీపీఎం ఏ పార్టీతో పొత్తులేకుండా ఒంటరి పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ తెలిపారు. 11వ తేదీ నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు, కార్పొరేషన్, ఇతర మున్సిపాల్టీలలో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై పోరాడింది తమ పార్టీయేనన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్‌దీపాలు, దోమలు, డ్రైనేజీ, రోడ్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, పాలకపార్టీల అక్రమాలపై నిరంతరం పోరాడామన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో డ్రైనేజీ, రోడ్ల పనుల్లో యథేచ్ఛగా దోపిడీ జరిగిందని, అధికారపార్టీ అన్ని విధాలా నెల్లూరు కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీకి బలమున్నచోటల్లా పోటీ చేస్తామన్నారు.

# అక్రమ మద్యంపై ఉక్కుపాదం

త్వరలో జరగబోయే అన్ని రకాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అక్రమ మద్యాన్ని అరికట్టడానికి కఠినచర్యలు తీసుకుంటున్నట్లు నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మినా రవాణా చేసినా దిగుమతి చేసుకున్నా ఉపేక్షించబోమన్నారు. నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని చెప్పారు. ఎక్కడైనా అక్రమ మద్యం, బెల్టుషాపుల ద్వారా, ఇతరత్రా విదేశీమద్యం విక్రయాలు జరుగుతున్నా వెంటనే 0861-2331159, గూడూరులో 08624-252695 నెంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుండి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక తమ పరిధిలో 149కేసులు నమోదుచేసి 125మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 95లీటర్ల నాటుసారా, 5400లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసామన్నారు. మన జిల్లాకు చెన్నై సమీపంలోనే ఉన్నందున విదేశీ, అక్రమ మద్యాన్ని నిరోధించడానికి తడ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో అదనపు ఈఎస్ ఎం.రవికుమార్, నెల్లూరు సిఐ జి.సూర్య నారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సీమాంధ్ర జేఏసీ దళిత కన్వీనర్‌గా పాముల శివకుమార్



నెల్లూరు దర్గామిట్టలో ఈ నెల 8న జరిగిన సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసి అంతరంగిక సమావేశంలో దళిత కన్వీనర్‌గా పాముల శివకుమార్‌ను నియమించడం జరిగిందని సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసి రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండలం, వెంకన్నపాళెంకు చెందిన శివకుమార్ చదువుకునే రోజుల నుంచే విద్యార్థి పరిషత్ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని పేర్కొన్నారు.


## స్థలములు & ఇల్లు అమ్మబడును

**భవానినగర్, కోవూరులో DTCP హైదరాబాద్ వారి అనుమతి పొందిన లే అవుట్ నందు అన్ని వసతులతో, అన్ని ఫేసులలో ఇండ్ల ప్లాట్లు మరియు ఒక డూప్లెక్స్ హౌస్ నార్త్ ఈస్ట్ కార్నర్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మకమునకు కలవు.**

కావలసినవారు సంప్రదించండి :

**94415 23251, 99892 87971.**



## నెల్లూరు కబుర్లు

## నెల్లూరులో జైరాం

ఆంధ్రరాష్ట్ర విభజనలో కీలకపాత్రధారి, జిఓఎం సభ్యుడు, కేంద్రమంత్రి దాసరి జైరాంరమేష్ 12వతేదీ నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చారు. ఆయన నేరుగా వాకాడు మండలంలోని దుగరాజపట్నం చేరుకున్నారు. అక్కడ పోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. పోర్టు నిర్మాణంపై అక్కడి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అక్కడనుండి నెల్లూరుకు వచ్చారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి ఇంట్లో ఏర్పాటుచేసిన విందుకు హాజరయ్యారు. ఇక్కడే విలేకరుల సమావేశం పెట్టారు.

## డీసీసీ అధ్యక్షుడికి ఎన్‌ఎంయు సత్కారం

ఈ నెల 10వ తేదీన నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రోటరీ ఆడిటోరియంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రీజియన్ గ్యారేజీ కార్మికుల సదస్సు జరిగింది. కొత్తగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన ఆ యూనియన్ రాష్ట్ర ముఖ్యఉపాధ్యక్షుడు కొడవలూరు ధనుంజయరెడ్డిని కార్మికులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో నిర్వహించే ఎన్‌ఎంయు రాష్ట్ర మహాసభకు అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానన్నారు. రేపు ఎన్నికల తర్వాత ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి కేంద్రాలలో ఆర్టీసీ కార్మికుల కోసం సూపర్‌స్పెషాలిటీ వైద్యంతో పాటు ప్రత్యేకవసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయు సీమాంధ్ర ఛైర్మెన్ ఆర్‌డిపిఐ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సి.హెచ్. చంద్రయ్య, జోనల్ అధ్యక్షుడు పి.జిలాని, కార్యదర్శి కె.రమణరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు లుక్సన్, రమణారెడ్డి, వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్మైల్ వాకర్స్ సేవా కార్యక్రమం



ఫలహారం చేస్తున్న విశ్వభారతి విద్యార్థినీవిద్యార్థులు

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం స్మైల్ వాకర్స్ సంఘం సభ్యులు ప్రతినెలా విధిగా నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న నెల్లూరు పెద్దాసుపత్రి ఎదురుగా వున్న విశ్వభారతి అంధుల పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఫలహారములు పంపిణీ చేసారు. మాగుంటలేఅవుట్‌లోని అమృత ఎస్టేట్ నివాసి కీర్తిశేషులు శివప్రసాద్‌రెడ్డి భార్య మంజులారెడ్డి వదాన్యతతో వారు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో స్మైల్ వాకర్స్ సభ్యులు మున్నా సుబ్రహ్మణ్యం, గణపం రాజగోపాల్‌రెడ్డి, కన్నం కృష్ణ, సోము భక్తవత్సలరెడ్డి, లెనిన్ టైలర్ మదార్, క్రేజీ టైలర్ కమృద్దీన్, డాక్టర్లు రూపినేని శ్రీనివాసులునాయుడు, తులం సుబ్బారావు, బాబురావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుల ఆశ్రమంలో

## కిట్టి మెంబర్స్ బియ్యం పంపిణీ



నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఈనెల 8న మాగుంట లే అవుట్‌లోని డి.ఆర్.రెసిడెన్సీకి చెందిన కిట్టి మెంబర్స్ వృద్ధులకు దుప్పట్లు, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక కుటుంబంగాని, దేశంగాని అభివృద్ధి సాధించడంలో స్త్రీ యొక్క పాత్ర ప్రముఖమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో 15వ డివిజన్ తెలుగు మహిళానేత అంచల వాణి, ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని సరళ, ఉచ్చి భవానీప్రసాద్, తానే మస్తాన్, తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 12వతేదీ నుండి మొదలయ్యాయి. జిల్లాలో ఓ పక్క ఎన్నికల హడావిడి ఉండగా, మరోపక్క పరీక్షల సందడి నెలకొంది. ఈ నెల 26వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

# 'దేశం'కే 'కాపు'కాస్తాం

నెల్లూరు జిల్లా బలిజ పరిరక్షణ సమితి అధ్యక్షులు మల్లు రామయ్య, ప్రధాన కార్యదర్శి గూడంశెట్టి రాంబాబు తెలుగు దేశంపార్టీకి మద్దతు ప్రకటిస్తూ ఓ ప్రకటన విడుదల చేసారు. విద్య, ఉద్యోగములలో వెనుకబడి వున్న కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలను బిసిలుగా గుర్తించి రిజర్వేషన్ కల్పిస్తామని తెలుగుదేశం అధిపతి చంద్రబాబునాయుడు తమ రాష్ట్ర, జిల్లా నాయకులకు మాట ఇచ్చారని, తాను ముఖ్యమంత్రి అయితే 10రోజులలో తమ కులానికి చెందిన బీద విద్యార్థులకు రూ.1000ల స్కాలర్‌షిప్ ఇస్తానని, ఆర్నెల్ల లోపు బిసి కమీషన్‌వేసి బిసిలుగా చేస్తానని చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ సభలో మాట్లాడినా బలిజ కులస్తులను బిసి రిజర్వేషన్‌లో చేరుస్తామని ప్రకటిస్తున్నారని, కాబట్టి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి కత్తెర మల్లికార్జున, కార్యవర్గసభ్యుడు గూడూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశంకు మద్దతు తెలుపుతున్న బలిజ నాయకులు

## తొలి నామినేషన్ కప్పిరదే!

నెల్లూరు నగరపాలకసంస్థ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక తొలి నామినేషన్ కప్పిర ఉమామహేశ్వరిదిగా నమోదైంది. మాజీకార్పొరేటర్ కప్పిర శ్రీనివాసులు సతీమణి అయినా ఉమామహేశ్వరి 50వ డివిజన్ నుండి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసారు. 10వ తేదీన ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేసారు.

## పార్టీ ఆఫీసుల వద్ద సందడి

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నెల్లూరులోని ప్రధాన రాజకీయపార్టీల కార్యాలయాల వద్ద జనజాతరగా ఉంటుంది. మినీబైపాస్‌లో తెలుగుదేశంపార్టీ కార్యాలయం, మాగుంట లే అవుట్‌లోని వైకాపా కార్యాలయం, చివరకు బీజేపీ ఆఫీసు వద్ద కూడా తిరునాల లాగా ఉండింది. కాని జిల్లా కాంగ్రెస్ కార్యాలయమైన ఇందిరాభవన్ వద్ద మాత్రం ఎలాంటి సందడి లేకుండా పోయింది. జిల్లా కాంగ్రెస్ వ్యవహారాలన్నీ కూడా ఏ.సి సెంటర్ నుండే నడుస్తుండడంతో ఇందిరాభవన్‌ను అనుకునే వాళ్లు లేకుండాపోయారు.

## ముసుగువీరులు

ఎన్నికలకోడ్ పుణ్యమా అని నెల్లూరు నగరంలో మహనీయుల విగ్రహాలన్నింటికి ముసుగులు తొడిగేసారు. ఎన్నికలొచ్చినప్పుడల్లా అధికారులకు ఇదో పెద్ద పనవుతుంది. విగ్రహాలకు ముసుగులు వేయడం, ఎన్నికలు కాగానే తీసేయడం, ఒకరకంగా ఎన్నికలప్పుడు ఈ ముసుగులు వేయడం కూడా మంచిదే! కులం, మతం, డబ్బు, మద్యం ప్రభావంతో జరిగే ఈ ఎన్నికలను చూస్తే ఆ మహనీయుల ఆత్మలు బాధతో ఆత్మహత్య చేసుకోవు!

## స్మైల్‌కు రక్తనిధి అనుమతి



డా॥ కిరణ్‌కు రక్తనిధి అనుమతిపత్రాన్ని అందిస్తున్న డా॥ సుధాకర్

స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాల అధినేత డా॥ జి.కిరణ్ అభ్యర్థన మేరకు రెడ్ క్రాస్ కన్వీనర్ డా॥ఈదూరు సుధాకర్ ఈనెల 11న రక్తనిధి అనుమతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ కన్వీనర్ డా॥ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగశ్రీ, ఆరోగ్యశ్రీ అనుమతి పొందగోరే వారందరూ తప్పనిసరిగా రక్తనిధి అనుమతి పొందాలని అన్నారు. ఆరోగ్యం ఆర్థిక సమస్యగా మారకూడదన్న జిల్లా కలెక్టర్ ఆశయం మేరకు ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారికి, ఆరోగ్యశ్రీ అనుమతి ఉన్న ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారికి, క్యాన్సర్, హెచ్.ఐ.వి, హిమోఫిలియా, తలసేమియా బాధితులందరికీ రక్తనిధి రక్తం ఉచితంగా సరఫరా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంత వైద్యశాల అధినేత డా॥జి.కిరణ్‌తో పాటుగా రక్తనిధి సిబ్బంది, రామాంజనేయులు, స్మైల్ దంత వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రంగనాథునికి నూతన శ్వేతఛత్రాలు

నెల్లూరు రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామికి ఈనెల 16న జరిగే బంగారు గరుడసేవకు వినియోగించే నూతన శ్వేత ఛత్రములు మధ్యాహ్నం 3గం॥లకు సమర్పిస్తామని శ్రీ కృష్ణచరిత మానస ప్రచార మండలి సభ్యులు తెలిపారు. మైపాడు గేటు దగ్గర వున్న ఆంజనేయస్వామి సన్నిధి నుండి బయలుదేరి వచ్చి శ్వేత ఛత్రములను రంగనాథునికి అందిస్తామని పేర్కొన్నారు. 22సంవత్సరముల నుండి జరుగుతున్న ఈ ఉత్సవ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొని స్వామి కృపను పొందమని కోరారు.

## డబ్బుంటే అగచాట్లే!

ఎన్నికలు వ్యాపారులు, ఇతర లావాదేవీలు జరిపే వారి పాలిట శాపంగా మారాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసు తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఎన్నికలలో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల కమీషన్ గట్టిగానే ప్రయత్నిస్తుంది. పోలీసులు బాగానే తనిఖీలు చేస్తున్నారు. కాని వీరి తనిఖీలతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఒక వ్యక్తి వద్ద 30వేల రూపాయలకు మించి నగదు ఉంటే పట్టుకుంటున్నారు. వెంటనే ఆ నగదును పోలీసుస్టేషన్‌లో అప్పగించి, లెక్కలు చూపించి తీసుకుపొమ్మంటున్నారు. దీంతో రోజూ లక్షల రూపాయలు చేతులుమార్చే వ్యాపారులు భయపడుతున్నారు. ఎన్నికలయ్యే దాకా ఆర్థిక లావాదేవీల జోలికి పోకూడదనుకుంటున్నారు. సాధారణ లావాదేవీలు కూడా ఆగిపోయి సామాన్య ప్రజలు సైతం ఆర్థిక అవసరాలకు ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

## పటిష్టంగా టెట్

రెండుసార్లు వాయిదాపడి మూడోసారి ఈ నెల 16న జరుగుతున్న టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్(టెట్)కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు జేసీ ఆర్.ఎస్.రాజ్‌కుమార్ ఆదేశించారు. 11వతేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో టెట్ నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. టెట్ పేపర్-1కు 1285మంది అభ్యర్థులు హాజరవుతారని, వీరికి 6పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. పేపర్2కు 10341మంది హాజరవుతారని, వీరికి 44పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



ఈ నెల 11వ తేదీన నెల్లూరులోని తన నివాసంలో నిర్వహించిన ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# మోడీ వెంటే జనం... బీజేపీదే జయం

**- వెంకయ్యనాయుడు**



సభకు ర్యాలీగా తరలివెళ్తున్న యం.వెంకయ్యనాయుడు దంపతులు

దేశ భద్రత, దేశ సమగ్రత, దేశాభివృద్ధికి నరేంద్రమోడీ ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఈ నెల 9వతేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'మోడీ ఫర్ పీఎం' సభను ఘనంగా నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత నెల్లూరులో బీజేపీ జెండాలు కళకళలాడాయి. కార్యకర్తలు కూడా స్వచ్ఛందంగా పెద్దసంఖ్యలో కదలివచ్చారు. ఈ సభనుద్దేశించి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ దేశ ప్రజలంతా ఈరోజు మోడీ వంటి సమర్ధవంతమైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మోడీని ప్రధాని కాకుండా ఫ్రంట్‌లు, టెంట్‌లు ఏర్పాటు చేస్తున్నారని, అలాంటి వారి ఆటలు సాగవన్నారు. రాజకీయాలలో నైతికత దిగజారిపోతుంది. విమర్శలు అసహ్యంగా ఉంటున్నాయి. మోడీని నపుంసకుడని కేంద్ర మంత్రి సల్మాన్‌ఖుర్షీద్ అన్నారు. ఎంత అసహ్యంగా ఉంది. మోడీ నపుంసకుడనే సంగతి ఈయనకెలా తెలుసు.. ఈయనేమన్నా ఆయన దగ్గరకు పోయాడా? అని ప్రశ్నించారు. మగతనం కాదు, ముందు మోడీ పనితనం చూడండని వెంకయ్య సవాల్ విసిరారు. యూపిఏ పదేళ్ల హయాంలో అవినీతి కుంభకోణాలు తప్పితే అభివృద్ధి అంటూ ఏమీ లేదు. వాజ్‌పేయి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో అందరికీ తెలుసు. రేపు మోడీ వస్తే దేశ స్వరూపమే మారిపోతుందన్నారు.

రాష్ట్ర విభజన విషయమై ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నేను మొదట అనుకూలమే. అయితే కేంద్రం రాష్ట్ర విభజన చేసిన తీరు చాలా అన్యాయమనిపించింది. కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును యధాతథంగా ఆమోదించి ఉంటే సీమాంధ్రలో ఈ నెల జీతాలు కూడా వచ్చేవికావు. ఆ బిల్లును చూసి నాకు బాధేసింది. బిల్లు పార్లమెంటుకు వచ్చే ముందు నాలుగురోజులైతే నిద్ర కూడా లేదు. తెలంగాణకు మా పార్టీ కట్టుబడి ఉంది. ఇప్పుడు తెలంగాణను వ్యతిరేకించడం భావ్యం కాదు. అలాగని యధాతథంగా బిల్లును ఆమోదిస్తే సీమాంధ్రకు అన్యాయం జరుగుతుంది. అందుకే బిల్లుకు సవరణలు ప్రతిపాదించాలనుకున్నాం. లోక్‌సభలో బిల్లుపై సుష్మాస్వరాజ్ మాట్లాడారు. కాని లోక్‌సభ ప్రత్యక్ష ప్రసారాలను కట్ చేసి బిల్లుపై ఆమె ఏం మాట్లాడింది లోకానికి తెలియకుండా చేసారు. అందుకే రాజ్యసభలో సీమాంధ్రకు న్యాయం కోసం నిలదీసాం. ప్రధానిని రాజ్యసభకు రప్పించి సీమాంధ్రకు న్యాయం జరిగేలా చేసాం. ప్రత్యేక ప్రతిపత్తి 5ఏళ్లే ఇచ్చారని బాధపడబళ్లేదు. రేపు మోడీ వచ్చాక దానిని పదేళ్లు చేస్తాం. హైదరాబాద్ పోయిందని బాధపడొద్దు. అది ఎక్కడికీ పోలేదు. అది మన దేశంలోనే వుంది. మన తెలుగువాళ్ల రాజధానిగానే ఉంది. ఇప్పటికైనా మేలుకుందాం. హైదరాబాద్‌లో మాదిరిగా అన్నింటిని ఒకే చోట పెట్టకుండా సీమాంధ్ర అంతటా అభివృద్ధి విస్తరించేలా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సీమాంధ్రతో పాటూ నెల్లూరు జిల్లాలోనూ కమలం వికసించాలని, బీజేపీ గుర్తు ఉంటే దాని మీద, లేదా దానితో ఏ పార్టీకైనా పొత్తు కుదిరితే ఆ పార్టీ గుర్తు మీద ఓటేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇంకా ఈ సభలో బీజేపీ కేంద్ర కమిటీ సభ్యుడు హరిబాబు, పార్టీ నాయకులు ఎస్.సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, పి.సురేంద్రరెడ్డి, వీర్రాజు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సభ విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణుల్లో ఎంతో ఉత్సాహం కనిపించింది. వెంకయ్యనాయుడు ఇంటి నుండి కార్యకర్తలు బైక్‌లు, కార్లతో ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఎప్పుడు రాజకీయ సభలకు రాని వెంకయ్య సతీమణి ఉషమ్మ ఈ సభకు ఆసక్తిగా రావడం విశేషం.

సింహపురి సమాచారం

## 'జై సమైక్యాంధ్ర'కు జై కొడదాం!



సమావేశంలో మాట్లాడుతున్న ఆనం జయకుమార్‌రెడ్డి

సమైక్యాంధ్ర ఉద్యమ నేత ఆనం జయకుమార్‌రెడ్డి ఇంటి వద్ద ఈనెల11న ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు, మిత్రులతో ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటూ వారి మనసెరిగి వ్యవహరించిన మంచి నాయకుడిగా ఆనం జయను అభివర్ణించారు. ఆయనకు తన సొంత సోదరులే అన్ని విధాలా తీరని అన్యాయం చేసారన్నారు. జయకుమార్‌రెడ్డి మాజీముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పెట్టనున్న "జై సమైక్యాంధ్ర" పార్టీలో చేరి తెలుగువారి అభ్యున్నతికి పాటుపడాలని చెప్పారు. ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సోదరులు ద్రోహం చేసినా నమ్మి అక్కున చేర్చుకొని గౌరవించిన కార్యకర్తలు, మిత్రులు మరియు శ్రేయోభిలాషుల రుణం తీర్చుకోలేనని అన్నారు. గౌరవప్రదమైన రాజకీయాలు చేయమన్నందుకే సోదరులు తనను దూరం పెట్టారని, సమైక్య పోరాటంలో మద్దతిచ్చిన మిత్రుల సూచన మేరకు "జై సమైక్యాంధ్ర" పార్టీలో చేరి ప్రజలకు మరింత సేవ చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరు నగరం, రూరల్ నుండి భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబుతోనే బ్రహ్మాండం



- సోమిరెడ్డి

చంద్రబాబుతోనే సీమాంధ్ర స్వర్ణాంధ్రగా మారుతుందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

సోమవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సిహెచ్ హరిబాబుయాదవ్, పి.టి. రంగరాజన్, కిలారి తిరుపతినాయుడు, దారా జయరాజ్, ఉడతా మధు, సుభాషిణి, చిరంజీవి తదితరులు తెలుగుదేశంలో చేరారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని బాగుచేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభంజనం ఉందని, స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి టిక్కెట్ల కోసం పోటీపడుతున్న అభ్యర్థులను చూస్తుంటేనే ఈ విషయం అర్థమవుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రజలు చంద్రబాబు నాయకత్వానికి మద్దతు పలకాలన్నారు. బీసీలు కూడా తమకు పెద్దపీట వేసిన తెలుగుదేశంకే అండగా నిలుస్తారన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీమాంధ్రకు తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్‌పార్టీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, రాచాల రవికుమార్‌యాదవ్, వై.వి.రామిరెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, అంచల వాణి తదితరులు పాల్గొన్నారు.

**ఆప్తులు, ఆత్మీయులు, అభిమానుల మధ్య**



# చిన్ని నారాయణరావు వెలిగించిన 'గుండెదీపం'






'గుండెదీపం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు, ఆత్మీయులు

ఆయన సంపాదన కోసం లెక్కలు రాస్తాడు, సమాజం కోసం రచనలు చేస్తాడు. ఆయనే చిన్ని నారాయణరావు. పేరులో "చిన్ని"గా కనిపించినా మేధస్సులో పెద్దవాడు. 'జీవితమే ఓ విజయం' అంటూ తన తొలి పుస్తకంతో నెల్లూరు సాహితీ రంగంలో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టి 'అంతర్ముఖం' రెండవ గ్రంథంగా, 'మాట' మూడవ ప్రచురణగా నేడు 'గుండెదీపం' నాలుగవ కవితల కూర్పుగా నెల్లూరీయులకు అంకితమిచ్చాడు.

ఆడిటర్‌గా అందరికీ పరిచితుడైన సుప్రసిద్ధ కవి, రచయిత, తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత చిన్ని నారాయణరావు రచించిన 'గుండెదీపం' కవితా సంపుటి మార్చి 9వ తేదీ ఆదివారం నెల్లూరు పురమందిరంలో ఆప్తులు ఆత్మీయులు అభిమానుల మధ్య ఆవిష్కరింపబడింది.

తన సహాధ్యాయి అయిన కావలి నియోజకవర్గ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరింపజేసారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ చదువుకునే రోజుల నుంచి చిన్ని నారాయణరావు రచనలు చేసేవారని, అప్పటినుంచి రచనా వ్యాసంగాన్ని ఇప్పటికీ కొనసాగించడం ఆయన రచనా పటిమకు నిదర్శనమన్నారు. దీనికి కుటుంబసభ్యుల సహకారం ఎంతో అవసరమని, దానిని అందిస్తున్న వారి కుటుంబసభ్యులను అభినందిస్తున్నానన్నారు. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన ప్రసిద్ధ సినీకవి, నెల్లూరీయుడైన వెన్నెలకంటి మాట్లాడుతూ చిన్ని నారాయణరావు కలం నుండి జాలువారే కవితలు భలే పదును కలిగివుంటాయని, సమాజంలోని రుగ్మతలను చీల్చి చెండాడుతుంటాయని పేర్కొన్నారు.

జ్యోతిప్రకాశనం చేసిన తదుపరి 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ 'లాయర్' పత్రికతో చిన్ని నారాయణరావుకి విడదీయరాని బంధం వుందని, ఒక విధంగా 'లాయర్' పత్రికతో అనుబంధంలో ఆయన సీనియర్, తాను జూనియర్ అని చమత్కరించారు. జీవితం ఓ విజయం, అంతర్ముఖం, మాట కవితాసంపుటిలను వెలువరించిన నారాయణరావు ఈరోజు నాల్గవ కవితాసంపుటి "గుండెదీపం" ద్వారా సందేశాత్మక రచనలతో సమాజంలో వెలుగులు ప్రకాశింపజేస్తున్నాడని అన్నారు. పుస్తకసమీక్ష చేసిన ప్రకాశం జిల్లా ఇంకొల్లుకు చెందిన ప్రముఖకవి బీరం సుందరరావు మాట్లాడుతూ చిన్ని నారాయణరావు అద్భుతమైన వ్యక్తీకరణ, పదసంపద వున్న కవి అని అన్నారు. భార్యమీద, బ్యాంక్ బ్యాలెన్స్ మీద మమకారం వుండేవారుంటారని, కాని, కవిత్వం మీద ప్రేమ కలిగివుండేవారు అరుదుగా వుంటారని, అటువంటి అరుదైన వ్యక్తుల్లో చిన్ని నారాయణరావు ఒకరని పేర్కొన్నారు. నారాయణరావు కవిత్వం చదవాలంటే మెదడుతో కాదు, హృదయంతోనే చదవాలని అన్నారు. "గుండెదీపం"లోని కొన్ని అద్భుతమైన కవితలను పేర్కొని చక్కనైన, చిక్కనైన కవిత్వం అంటే ఇదేనని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్ని నారాయణరావు దంపతులను కళాంజలి పక్షాన ఘనంగా సత్కరించారు. నారాయణరావు కుమారుడు చిన్ని శ్రావణ్‌కుమార్‌తో పాటు కోడలు, మనుమడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద, బి.సి.సంఘం అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యయాదవ్, కోమిట్ల సత్యనారాయణ, వీరిశెట్టి హజరత్‌బాబు, అవోపా అధ్యక్షులు ఎం.పి.ఆంజనేయులు, జయంతి పబ్లికేషన్స్ ఎస్.వి.కృష్ణ, మయూరి సుబ్బారావులు పాల్గొనగా కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కవి, వక్త పి.యస్.యస్.వరప్రసాద్ రావు సభను నిర్వహించారు. పుస్తకావిష్కరణకు పూర్వం జరిగిన సినీసంగీత విభావరిలో చిన్నారులు సుగంధిని, అనూష, హంసిని, రంజని, జ్ఞానశ్రీ, శ్వేత, తేజస్విలు మృదుమధురమైన అలనాటి సినిమాల గీతాలను ఆలపించి అందరినీ అలరించారు. వారికి సంగీత సహకారాన్ని పవన్, సంగీత్‌లు కీబోర్డుపై, అనూప్ ఫ్లూట్‌పై, గిరి ప్యాడ్‌పై, శాంతి తబలాపై అందించారు.

కాగా, తన గానమాధుర్యంతో అలరించిన చిన్నారి సుగంధినికి కావలి శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు 10వేల రూపాయల బహుమానాన్ని అందించి కళాకారులపై తన మక్కువను చాటుకున్నారు.

చక్కని సుమధుర ఆపాత మధురాలను సమకూర్చి సంగీతప్రియులను తన్మయత్వంలో ఓలలాడించిన జి.వి.శర్మనూ అభినందించాల్సిందే!



కళాంజలి పక్షాన చిన్ని నారాయణరావు దంపతులను సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

# తెలంగాణ 'గజిని'

అది ఢిల్లీ రేస్‌కోర్స్‌రోడ్డులోని ప్రధాని మన్మోహన్‌సింగ్ కార్యాలయం. ప్రధానితోపాటు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, చిదంబరం, షిండే, ఆంటోని, జైరాంరమేష్, దిగ్విజయసింగ్, గులాంనబీఆజాద్, కమలనాథ్, పనబాక లక్ష్మి, మనీష్ తివారీ, కపిల్ సిబాల్ వంటి నాయకులు, మరికొందరు ఎంపీలున్నారు. తెలంగాణబిల్లును ఆమోదింపజేయడంలో విజయవంతంగా తమ పాత్ర పోషించిన నాయకులకు అక్కడ సన్మానసభ ఏర్పాటు చేసారు. ఈ క్రమంలో దిగ్విజయసింగ్, షిండే, దాసరి జైరాం రమేష్‌లను ప్రధాని ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత పార్లమెంటులో టీ-బిల్లు ప్రవేశపెట్టినప్పుడు సీమాంధ్ర ఎంపీలను కట్టడి చేయడానికి మూడంచెల గూండాసిస్టంను అమలు చేసిన కమలనాథ్‌ను, అలాగే సీమాంధ్ర ఎంపీలను నలగదన్ని పట్టపగలే చుక్కలు చూపించిన వివిధ రాష్ట్రాల ఎంపీలను కూడా ప్రధాని శాలువాలు, గజమాలలతో సత్కరించారు. సన్మాన కార్యక్రమం తర్వాత సోనియాగాంధీ మాట్లాడుతూ ఈరోజు వీళ్లను సన్మానించడానికి ప్రత్యేకకారణం ఉంది. ఒక పనిని ఆ పని చేతయిన వాడు చేయడం గొప్పకాదు, ఆ పనిని చేతకాని వాడు చేయడం చాలా గొప్ప విషయం. ఈరోజు ఇక్కడ సన్మానం అందుకున్న వాళ్లు అదేపని చేసారు. వీళ్లకు రాష్ట్రాన్ని ఎలా విభజించాలో తెలియదు. ఎల్‌కెజి చదివే పిల్లాడిని ఎంసెట్ ఎంట్రన్స్ రాయమంటే ఎలా ఉంటుంది? వీళ్లూ అంతే! రాష్ట్ర విభజన అంటే ఏంటి... ఏ పద్ధతులు అనుసరించాలి, రాజ్యాంగ నిబంధనలేంటనే విషయాలే వారికి తెలియవు. నేను ఆంధ్రప్రదేశ్‌ను చీల్చమన్నాను కాబట్టి వాళ్లు రెండో ఆలోచన లేకుండా మొండి పట్టుదలతో ఆ పనిచేసారు. నేను ఒక ఎలుకను చూసాననుకుందాం... ఆ ఎలుక కొండక్రింద కలుగులోకి పోయిందనుకుందాం, ఆ ఎలుకను నేను కావాలంటే మావాళ్లు నెలలు, సంవత్సరాల పాటు ఆ కొండను తవ్వయినా ఎలుకను పట్టుకొస్తారు. నా మాటంటే వాళ్లకు అంత భక్తి. నా పట్ల ఇంత భక్తిని చూపించే వీరికి నావంతుగా ఈ చిరుసత్కారం చేస్తున్నాని చెప్పి ముగించింది. తర్వాత అందరూ తేనీటి విందుకు లేచారు.

అక్కడ ఓ కుర్చీలో కూర్చుని స్నాక్స్ తింటున్న సోనియా చుట్టూ కాంగ్రెస్ నాయకులు గుమికూడారు. షిండే ఉండి... మేడమ్, మిమ్మల్ని చాలా రోజుల నుండి ఒకటి అడగాలనుకుంటున్నా... మీరు ఉన్నట్లుండి తెలంగాణ ఇవ్వాలని ఎందుకు నిర్ణయం తీసుకున్నారని అడిగాడు. అందుకు సోనియా... కేసీఆర్ మీద పగతీర్చుకోవడానికని చెప్పింది. ఆ మాటకు షిండేతో పాటు పక్కనున్న వాళ్లు కూడా బిత్తరపోయారు. అదేంటి మేడమ్, కేసీఆర్‌పై మీకు పగేంటి అని షిండే అడిగాడు. దానికి సోనియా... ఆ కేసీఆర్ నన్ను ఒకరకంగా తిట్టాడా... తెలంగాణ ఇవ్వకపోతే నన్ను బజారుకీడుస్తానన్నాడు, దేశానికి పట్టిన దెయ్యాన్నాడు, ఇటలీకి తరిమికొట్టాలన్నాడు, కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలన్నాడు... ఈ మాటలన్నీ కూడా నా మనసులో గింగిరాలు తిరుగుతూ కేసీఆర్ మీద ఎప్పటికప్పుడు కసిని ఎగదోస్తున్నాయని అంది. అది విని చిదంబరం... కేసీఆర్ మీద పగతీరాలంటే తెలంగాణ ఇవ్వకుండా ఉండాలిగాని, తెలంగాణ ఇచ్చేస్తే అతని మీద పగతీర్చుకోవడం ఎలా అవుతుంది, ఇంకా మంచి చేయడమేగాని అన్నాడు. మీరు అక్కడే సాంబారులో కాలేస్తున్నారు. కేసీఆర్ గతంలో ఏం మాట్లాడాడో చూసారు కదా... తెలంగాణ ఇస్తే తన టీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తానన్నాడు. అందుకే మనం వెంటనే తెలంగాణ ఇచ్చేసాం... ఇప్పుడతను టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తాడని సోనియా అంది. దానివల్ల మీ పగ ఎలా తీరుతుందని మనీష్‌తివారి అడిగాడు. దానికి సోనియా... ఇక్కడి నుండే కేసీఆర్‌కు సినిమా కష్టాలు మొదలవుతాయి. కాంగ్రెస్‌లో విలీనమయ్యాక మన వద్ద వి. హెచ్.హనుమంతరావుకైనా, కేసీఆర్‌కైనా ఒకటే న్యాయముంటుంది. నేను వస్తున్నానంటే కేసీఆర్ చేతులు కట్టుకుని నిలబడాల్సిందే! ఎన్నికలొచ్చాయనుకోండి... కేసీఆర్ మనుషులకు ఒక్క టిక్కెట్ కూడా ఇవ్వను. దాంతో అనుచరులంతా కేసీఆర్‌ను వదిలేస్తారు. తన సీటు కోసం కేసీఆర్‌కు టెన్షన్ తప్పదు. నన్ను కాకా పట్టాలని చూస్తాడు. దెయ్యం అన్న నోటితోనే నన్ను దేవత అని పొగుడుతాడు. కేసీఆర్ కరీంనగర్ లోక్‌సభ నుండి పోటీ చేయాలనుకుంటే దాని కోసం 10మంది నాయకులను టిక్కెట్ రేసులో దించుతాను. కేసీఆర్‌కు అప్పుడు టిక్కెట్ టెన్షన్ పట్టుకుంటుంది. కేసీఆర్ నా గది గుమ్మం ముందు స్టూల్ వేసుకుని కూర్చుని నా అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తుంటాడు. నేను మాత్రం లోపల కంప్యూటర్‌లో వీడియోగేమ్ ఆడుకుంటుంటాను. కరీంనగర్‌లో నామినేషన్ వేసేరోజు ఉదయం కూడా కేసీఆర్ నా గది బయటే బి-ఫారం కోసం టెన్షన్‌తో ఎదురుచూడాలి. నేను ఉదయం 11గంటలకు బి-ఫారం ఇస్తాను. అతను హడావిడిగా ఎయిర్‌పోర్ట్‌కు పోయి విమానమెక్కి హైదరాబాద్‌లో దిగుతాడు. అక్కడ నుండి మన్మధుడు సినిమాలో నాగార్జున మాదిరిగా అందిన బండినల్లా పట్టుకుని కరీంనగర్ చేరుకుని ఇంకో పది నిముషాల్లో నామినేషన్ గడువు ముగుస్తుందనగా పరుగెత్తుకుంటూ పోయి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ ఇస్తాడు. ఎన్నికల్లో కేసీఆర్‌ను గెలిపిస్తాం. కేంద్రమంత్రి పదవి వస్తుందని ధీమాగా ఉంటాడు. కాని మనం అతనికి మంత్రి పదవి ఇవ్వం. తెలంగాణ కోసం ఏరోజూ ఉద్యమం చేయనివాడిని, పనికిమాలిన నాయకుడిని వెదికి మంత్రిపదవి ఇస్తాం. దీంతో కేసీఆర్ మరింతగా మానసిక వేదనకు గురవుతాడు. రోజూ కుళ్లికుళ్లి ఏడుస్తుంటాడు. కేసీఆర్‌లో ఆ ఏడుపు చూడడానికే నేను తెలంగాణ ఇచ్చానని సోనియా అంది. మీ మైండ్ సూపర్ మేడమ్... అందుకే మాకు హైకమాండ్ అయ్యారని అందరూ పొగిడారు. అంతలో అక్కడకు వి. హెచ్.హనుమంతరావు ఆయాసపడుతూ వచ్చి... మేడమ్, ఆ కేసీఆర్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనంటున్నాడు, ఎంత దుర్మార్గం అని అన్నాడు. ఆ మాటతో సోనియా ఒక్కసారిగా ఖంగు తింది. ఆమె ఊహాలోకమంతా తల్లక్రిందులైంది.

★★★★★

అది కేసీఆర్ నివాసం... ఓ వైపు సోనియా, షిండే, దిగ్విజయసింగ్, దాసరి జైరాంరమేష్, ఇంకోపక్క కేసీఆర్, హరీష్‌రావు, ఈటెల రాజేందర్ కూర్చున్నారు. సోనియా ఉండి... కేసీఆర్‌గారు, ఇది చాలా అన్యాయం, మీరు టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానంటేనే తెలంగాణ ఇచ్చాం, ఈరోజు విలీనం చేయనంటే ఎలా అని అడిగింది. దానికి కేసీఆర్ తల అటూ ఇటూ తిప్పుతూ... తెలంగాణ ఏంటి...విలీనమేంటి? అసలు మీరంతా ఎవరు? నువ్వు ఏ దేశస్తురాలివి అని సోనియాను అడిగాడు. కేసీఆర్ మాటలతో వారికి తలతిరిగింది. దిగ్విజయ్ వుండి... ఏంటి కేసీఆర్, మరీ ఇంత దారుణంగా మాట్లాడుతున్నావ్... ఏరు దాటాక తెప్పను తగలేయడమంటే ఇదే కదా అని అన్నాడు. ఏరేంటి, తెప్పేంటి, అసలు మీరే పని మీద వచ్చారు. ఏదన్నా చందా కావాలంటే తీసుకుపోండి... హరీష్ వాళ్లకు ఓ వంద రూపాయలిచ్చి పంపించు అని కేసీఆర్ అన్నాడు. ఆ మాటతో దాసరి జైరాంరమేష్‌కు మండింది. లక్షల కోట్లు కొల్లగొట్టాం... నీబోడి వందరూపాయల కోసం వచ్చామనుకుంటున్నావా.. నీ బోడి పార్టీని విలీనం చేస్తే ఎంత, చేయకపోతే ఎంత... ఇక్కడ లాస్ అయ్యే సీట్లను ఇంకో రాష్ట్రాన్ని చీల్చి తెచ్చుకుంటామని ఆవేశపడసాగాడు. అప్పుడే షిండే, దిగ్విజయ్‌లు... కూల్ రమేష్ కూల్... ఇలాంటివన్నీ ఆవేశాలతో పరిష్కారం కావు, చర్చలతోనే పరిష్కారమవుతాయని సముదాయించారు. తర్వాత షిండే వుండి... హరీష్ రావు గారు, మీరైనా చెప్పండి మీ మామకు... తెలంగాణ ఇస్తే ఆయనే పార్టీని విలీనం చేస్తానన్నాడు, ఇప్పుడు చేయనంటే ఎలా? అది కూడా మేమెవరిమో తెలియనట్లే మాట్లాడుతున్నాడు, మాకు చాలా బాధగా ఉందన్నాడు. దానికి హరీష్‌రావు వుండి... ఇందులో ఆయన తప్పేమీ లేదండి, నిజంగానే ఆయన ఎవరినీ గుర్తుపట్టడం లేదు, నిజం చెప్పాలంటే మమ్మల్ని కూడా గుర్తు పట్టడం లేదు, మీరు సూర్య హీరోగా నటించిన 'గజిని' సినిమా చూసుంటారుగా, మా మామ పరిస్థితి కూడా అందులో సూర్య మాదిరిగా మారింది. మీరిచ్చిన షాక్‌తో మెమొరీలాస్‌తో బాధ పడుతున్నాడని చెప్పాడు. మేము షాక్ ఇవ్వడమేంటి... ఈ కొత్త ట్విస్ట్ ఏంటని దిగ్విజయ్ అడిగాడు. అందుకు హరీష్... మరి ఇది షాకే కదా... ఈ టైంలో మీరు తెలంగాణ ఇస్తారని ఆయన కలలో కూడా ఊహించలేదు. మీరు ఒక్కసారిగా బిల్లు తేవడం ఆయనను షాక్‌కు గురిచేసింది. దీంతో గతాన్ని మరచిపోయారు. వైద్యనిపుణుల ద్వారా ఆయనకు గతాన్ని గుర్తుకుతెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం, ఆయనకు గతం గుర్తుకొస్తే, మీ పార్టీలో టీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని ఆయన చెప్పిన మాట ఆయనకు గుర్తుంటే అప్పుడు పిలుస్తాం, విలీనమైనా, పొత్తయినా ఆయనకు గతం గుర్తొచ్చాకే అని చెప్పాడు. దాంతో కాంగ్రెస్ నేతలు ఉసూరుమంటూ అక్కడనుండి లేచారు.

## కదంబం

### కాటు

**సిరికి స్వామినాయుడు,**
**9494010330.**

"చిన్నప్పుడు
పాము కాటేసింది
గాయాన్ని పసురునీళ్ళతో
కడుక్కుంటేపోయింది
ఇప్పుడు
పాముకంటే విషపూరితమైన
మనిషి కాటేసాడు
మానాన్ని ఏ నీళ్ళతో
కడుక్కోవాలో చెప్పవే అమ్మా...!"

### ఒక

**మంత్రి కృష్ణమోహన్,**
**మార్యాపురం.**
**94410 28186**

లయకుదరలేదు
పదం పడలేదు
మొగ్గ విరియలేదు
పొద్దుట్నుంచి ఇక్కడే
పాతుకుపోయాను
యాతన పడ్డాను

పూసిందొక
పువ్వు
హాయి
శాంతి.

**16న విజయమహల్ సెంటర్‌లో...**

## శ్రీనివాస కల్యాణం

నెల్లూరు విజయమహల్ సెంటర్‌లో ఈనెల 16న సాయంత్రం 6గంటలకు టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు సంయుక్త నిర్వహణలో శ్రీనివాస కల్యాణం మహోత్సవం జరుగుతుందని వ్యాపారమిత్ర మండలి సభ్యులు తెలిపారు. స్వామివారి కల్యాణం మహోత్సవంలో పాల్గొనే దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించాలని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్వాన్ వివియస్ వినోద్‌కుమార్ అన్నమయ్య సంకీర్తన చేస్తారని తెలిపారు.

## రంగడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో మొదలయ్యాయి. మంగళవాయిద్యాలు, కర్పూర హారతులు, రంగనాథస్మరణలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంకురార్పణ సందర్భంగా విశ్వక్సేనునికి ప్రత్యేకపూజలు, భూమిపూజలు నిర్వహించారు. స్వామివారిని సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయంలో మూలవర్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. రంగడి బ్రహ్మోత్సవాలతో రంగనాయకులపేట ప్రాంతానికి పండుగొచ్చింది. ఈ ప్రాంతం విద్యుత్‌దీపాల కాంతులతో ధగధగలాడుతుంది.

## మొదలైన కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు



బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూటక్షేత్రంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుండి అంకురార్పణతో మొదలయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు వేదగిరి సత్యనారాయణాచార్యులు, యజ్ఞకులు వంశీ కృష్ణమాచార్యులు, ఇఓ దబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అర్చక బృందం విశ్వక్సేనుని పూజను నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేసింది. అలాగే 12వతేదీ బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారికి తిరుమంజనం, రాత్రి ధ్వజావరోహణ, శేషవాహనసేవ, పూలంగిసేవ వైభవంగా నిర్వహించారు.

## "గుండె ఘోష"

**పి.అజిత(అపర్ణ),**
**నెల్లూరు,**
**94903 70266.**

పాపపున్నెమెరుగని ఓ చిట్టి చెల్లీ
కనికరమే లేని ఈ కుళ్లు లోకంలో కన్నీళ్లు పెట్టొద్దే మళ్లీ మళ్లీ
గొంతు ఎండేట్టు గుక్కెట్టినా
ఈ రాతి గుండెలు కరగవాయె
కుంతికే కూతురైనందుకు కుమిలిపోవద్దే కుళ్లి కుళ్లి
ఏ మాయకో మానభంగానికో
కుచ్చుటోపియైన ఆ తల్లికి
కూసింత కూడైన నీడైన
కరువాయెనేమో ఈ పాడు లోకంలో
వివేకం వదిలేసి, సంస్కారం మరచిపోయిన
ఈ కుళ్లిపోయిన సమాజం ఆ తల్లిని కుళ్లబొడిచెనేమో
ఆ భయానికో, అవమానానికో
చెత్తకుప్పనే నీకు పానుపేసెనేమో
ఆడబిడ్డలయినందుకు ఆ తల్లికీ, ఈ చిట్టిచెల్లికీ అడుగడుగునా
అవహేళనలూ, ఆపదలూ...
అన్నిటినీ పారద్రోలేట్టుగా
కాళికలా కన్నెర్ర చేస్తేనే, గొంతెత్తి పాలికేక వేస్తేనే
ఈ మాయాలోకం నీకింత చోటిస్తాది తల్లీ
ఓ నా చిట్టి చెల్లీ!!

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

వర్కర్లతో యజమానులకు సమస్యలుంటాయి. షేర్లు, స్థిరాస్తులపై ఆదాయం పెరగడం, పెట్టుబడి రంగాలలో మదుపుచేయడం ఉంటుంది. వృత్తిపరంగాను, వ్యాపారరంగాలలో మంచి అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. పనులు, కార్యక్రమాలు తలచినరీతిలో జరుగుతున్నను ఎక్కువ టెన్షన్‌పడుతుంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, అధికారవర్గంతో బాగుంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

షేర్లు, స్థిరాస్తులపై ఆదాయం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు నెరవేరతాయి. దైవకార్యాలలో పాల్గొంటారు. ఆర్థికవనరుల అభివృద్ధికి, వ్యాపారంలో పెరుగుదలకు మీ శ్రమ ప్రయత్నాలు ఫలించడం ప్రారంభంకాగలదు. ఆదాయంపెరుగుతుంది. కుటుంబ నిర్ణయాలు కొన్నింటిలో మీకు అనుకూలత సరిగా ఉండదు. కొద్దిగా శరీరం నలతగా ఉంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వర్కర్లతో మాత్రం జాగ్రత్తగా మెలగండి. ఆరోగ్యం కూడా అంతగా అనుకూలించదు. ఇంతకు ముందు ఇబ్బంది పెట్టిన పనులు, సన్నివేశాలు పరిష్కారమౌతాయి. వృత్తి ఉద్యోగాలలో అనుకూలమగు మార్పులుండగలవు. వ్యాపారవర్గాలకు విస్తరణకు, పెట్టుబడులకు అవకాశాలు లభించగలవు. పరిశ్రమల యాజమాన్యాలకు, కాంట్రాక్టర్లకు క్రొత్త అవకాశాలు లభించవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

మీ లోపాలను సరిదిద్దుకొని కొత్త నిర్ణయాలు చేపట్టుతారు. సహచరులు, అధికారుల ప్రశంసలు ఉద్యోగులకు లభిస్తాయి మరియు బాధ్యతలు పెరుగుతాయి. దైవ, సమాజ కార్యక్రమాలలో ఆసక్తి చూపుతారు. వృత్తి పరంగా వ్యాపకాలు, పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార రంగంలో పోటీతత్వం పెరిగి, క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు ప్రయత్నిస్తారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 14.03.2014 నుండి తేది. 20.03.2014 వరకు**

**ఈ వారము సింహకన్యతులా రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, మిథునంలో గురువు, తులలో రాహుకుజశనులు, మకరంలో శుక్రుడు, కుంభంలో బుధుడు, మీనంలో రవి సంచరిస్తారు.**

**పంచాంగము:** తేది 16 ఆదివారము హోళీపండుగ.

**ముహూర్తములు:** తేది 19 బుధవారము ఉదయం 9గం॥ల నుండి 11గం॥లలోగా వృషభలగ్నమున గృహప్రారంభం, వ్యాపార, వివాహములు.

**ఫాల్గుణ మాస శుక్ల పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | త్రయోదశి | రా॥గం7.32వ॥ |
| తేది. 15 | శని | చతుర్దశి | రా॥గం9.15వ॥ |
| తేది. 16 | ఆది | పూర్ణిమ | రా॥గం.10.31వ॥ |

**ఫాల్గుణ మాస కృష్ణ పక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | సోమ | పాడ్యమి | రా॥గం.11.25వ॥ |
| తేది. 18 | మంగళ | విదియ | రా॥గం.11.40వ॥ |
| తేది. 19 | బుధ | తదియ | రా॥గం.11.34వ॥ |
| తేది. 20 | గురు | చతుర్థి | రా॥గం.10.43వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

మంచి పురోభివృద్ధి సాధిస్తారు. శుభకార్యాల తేదీలు నిర్ణయంకావడం, దూరప్రయాణాలు నిర్ణయంకావడం జరుగుతుంది. పెద్ద మొత్తాలలో ఆర్థిక లావాదేవీలు చేపట్టవద్దు. వృత్తి ఉద్యోగాలలో గుర్తింపు బాగుంటుంది. కళా, క్రీడా, సాంకేతిక, విజ్ఞాన రంగాల వారికి ప్రయాణాలు, ఉద్యోగావకాశాలు బాగుంటాయి. పరిశ్రమలు, వ్యాపారవర్గాలకు ఆదాయం పెరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్య తేదీలు కొద్ది వాయిదాపడతాయి. ఉద్యోగులకు పనిభారం ఉంటుంది. మరియు అధికారులు, పబ్లిక్‌తో సమస్యలు ఏర్పడవచ్చును. వృత్తి ఉపాధి ప్రయత్నాలలో మంచి అభివృద్ధి, వ్యాపారపరంగా ఆదాయం పెరగడం ఉంటుంది. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకొనడం, ప్రముఖులతో పరిచయాలుంటాయి. క్రొత్త గృహోపకరణాలు, విలాస వస్తువుకొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రలోభాలకు దూరంగా ఉండండి. ఆత్మీయబంధువులకు అనారోగ్య సమస్యలుంటాయి. శుభకార్యాలు నిర్ణయంకాకుండా నలుగుతారు. ఆర్థికపరమైన ఇబ్బందులుంటాయి. డబ్బు సర్దుబాటుకు కొద్ది శ్రమపడతారు. వృత్తి నిర్వహణలో స్తబ్ధత, వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవడం ఉంటుంది. వ్యాపార పోటీలో వెనుకబడతారు. అనుకోని ప్రయాణాలుంటాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బంధువర్గంలోను, కుటుంబంలోను అనారోగ్య బాధితులుంటారు. చేపట్టిన పనులు మార్పులు చేర్పులు చేసుకొనవలసిన స్థితి ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ఆశించిన అభివృద్ధి ఉండదు. ఖర్చులను అదుపు చేయలేరు. ఆదాయం తగ్గుతుంది. మొగమాటం, లౌక్యం లేకుండా వ్యవహరిస్తే ఇబ్బందులలో పడతారు. సమావేశాలలో మీ సూచనలు సలహాలపై విమర్శలుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సోదరవర్గంతో విభేదాలు తలెత్తగలవు. వృత్తిపరంగా పురోగతి గుర్తింపు దొరుకుతుంది. చేపట్టిన పనులు సమర్థవంతంగా పూర్తిచేసారు. కమిటీ సమావేశాలలో మీ ఆలోచనలను సమర్థిస్తారు. క్రయవిక్రయాలు లాభిస్తాయి. వ్యాపారరంగంలో పురోభివృద్ధిలో సాగుతూ ఆదాయం పెంచుకుంటారు. క్రొత్త పెట్టుబడులు, నిర్మాణాలకు బ్యాంకు ఋణాలు, దొరుకుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అవసరాలకు కొంత ఋణం చేయడం జరుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారవర్గాలకు అభివృద్ధి ఉండి ఆటంకాలు తొలగిపోతాయి. అనుకున్న పనులు మరోరకంగా మారి గందరగోళం సృష్టిస్తాయి. ఉద్యోగులకు స్థానమార్పులు, కీలకబాధ్యతలు స్వీకరించడం ఉంటుంది. ఆడంబరాలకు, సౌకర్యాలకు ఖర్చులు పెరుగుతాయి. వృత్తిపరంగా ఆర్థికస్థితి సుమారుగా ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వమునకు చెల్లింపులు సకాలంలో చేస్తారు. ఉద్యోగులకు అధికారులకు మధ్య అవగాహన బాగుంటుంది. పనులు తొందర తొందరగా పూర్తిచేయడం, దూరప్రయాణాలు నిర్ణయంకావడం ఉంటుంది. గృహోపకరణాలు, విలువైన వస్తువుల కొనుగోలు ఖర్చులుంటాయి. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. వ్యాపారపరంగా అవకాశాలు, వ్యాపార విస్తరణ జరుగుతుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు. బంధుముఖ్యులకు వీడ్కోలు చెప్తారు. ఉద్యోగపరంగా ప్రతిభచూపడం, అధికారులతో సామరస్యం బాగుంటుంది. ఆర్థికంగా బాగుంటుంది. కుటుంబ సభ్యులతో చిరుబేధాభిప్రాయాలుండి సర్దుబాటుకాగలవు. వృత్తిపరంగా సంతృప్తి, వ్యాపారపరంగా అభివృద్ధి అవకాశాలు బాగుండి, ఆదాయం పెరుగుతుంది.

# అవార్డుల గ్రహీత ఎం.ఎస్. ఆషా



చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో ఎం.ఎన్.జమరూత్, ఎం.ఎస్.గౌహర్లకు జన్మించిన కుమార్తె ఎం.ఎస్.ఆషా నాట్యంలో అవార్డుల గ్రహీతగా పేరుగాంచింది. ఈమె ఆంధ్ర భవన్, న్యూఢిల్లీలో ఉగాది పండుగలో పాల్గొని అప్పటి ముఖ్యముంత్రి నారా చంద్రబాబునాయుడుచే ప్రశంసలు పొందింది.

న్యూఢిల్లీ బాలభవన్‌నందు భరత నాట్య ప్రదర్శన చేసి సోనియాగాంధీ చేత అవార్డులను అందుకుంది. అలాగే అప్పటి రాష్ట్రపతి డాక్టర్ శంకర్‌దయాళ్‌శర్మచే కూడా తొలి జాతీయ అవార్డు "బాలశ్రీ" చేజిక్కించుకుంది. రెండోసారి రాష్ట్రపతి భవన్‌నందు అవార్డుల పండుగల్లో పాల్గొని "అబ్దుల్ కలాం"చే కూడా ప్రశంసలు పొందింది.

విదేశాల్లో సైతం స్విడ్జర్లాండ్‌లో ఏషియన్ ఫుడ్ అండ్ కల్చరల్ ఫెస్టివల్‌లో పది దేశాల వారితో 45 రోజులు పాల్గొని మనదేశ ఖ్యాతిని నిలిపింది. అలాగే అనేక ముఖ్య పట్టణాలలో నాట్య ప్రదర్శనలు ఇచ్చి సుమారు 1000 కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు పొందింది. ఈమె మొదటి గురువు శ్రీమతి ఐ.కణ్ణమ్మ, రవి సుబ్రమణ్యం మరియు ప్రస్తుతం ఈమె " కథక్ " డ్యాన్స్‌లో గురువు అమిత్ సరస్వత్ వద్ద రాజస్థాన్ (జైపూర్) నందు శిక్షణ పొందుతున్నది. ఇటీవల శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కథక్, రాజస్థానీ నృత్యం, కూచిపూడి నాట్యం ప్రదర్శించి భక్తులను ఆకర్షింప చేసింది.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసులు త్వరితగతిన పరిష్కరించాలి




సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

నెల్లూరు జిల్లా కలెక్టరు కార్యాలయం ఆవరణలోగల గోల్డన్‌జూబ్లీ హాల్లో ఈనెల 11ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల కేసులను త్వరిగతిన పరిష్కరించాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసులను పరిష్కరించి, బాధితులకు నష్టపరిహారం చెల్లించుటలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయుటలో చొరవ చూపాలన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ గంగాధర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్రతి కేసును సంబంధిత పోలీసు స్టేషన్లలో బాధితులు రిపోర్టు చేసిన వెంటనే నమోదు చేసి, న్యాయం జరిగేలా చూడాలన్నారు. బాధితులకు మంజూరైన ఆర్థిక సహాయం అందించుటలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు.

సమావేశంలో అదనపు జె.సి.ఆర్.ఎస్ రాజ్‌కుమార్, ఆర్డీవోలు సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, మధుసూదనరావు, వెంకటరమణారెడ్డి, కోదండరామిరెడ్డి, రమణ, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి మునిసిపల్ నామినేషన్ల స్వీకరణ



చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. సోమవారం నుంచి నామినేషన్లు స్వీకరణకు శ్రీకారం చుట్టారు. అలాగే మున్సిపల్ కమిషనర్ అజయ్‌కిషోర్ " లాయర్ " ప్రతినిధితో మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు సంబంధించి పరిశీలన జరిపారన్నారు. నామినేషన్ల స్వీకరణకు పట్టణంలోని 35 వార్డులకు ఏడు బూత్‌లు ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో మొత్తం జనాభా 90,053 వీరిలో ఓటర్లు 57,139, మహిళా ఓటర్లు 29,187 మంది వుండగా పురుషులు 27,952 మంది ఉన్నారు. వీరిలో కులాల వారీగా పరిశీలిస్తే బిసిలు 21,609, ఎస్.టి.లు 1708, ఎస్.సి.లు 5200, ఇతరులు 27,134 మంది ఉన్నారని వివరించారు. ఈ ఏడు కౌంటర్లలో ఒక్కొక్క కౌంటర్‌లో ఏడు వార్డుల నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఒక్కొక్క కౌంటర్ వద్ద ఎన్నికల నిర్వహణకు అధికారుల్ని నియమించారన్నారు.

ఎన్నికలు సజావుగా జరగటానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. నియమనిబంధనలు పాటించి అధికారులతో సహకరించాలన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితోపాటు ఇద్దరిని మాత్రమే అనుమతిస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణ సందర్భంగా భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఎన్నికలు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 30న జరిగే ఎన్నికలకు రిజర్వేషన్‌ను ప్రకటించిన వార్డుల అన్ రిజర్వ్‌డ్ వార్డులు 4,14,19,20,20, 22,25,26, 30,31, జనరల్ మహిళలు 1,7,9,12,27, 29,32,34, వెనుకబడిన తరగతుల మహిళలు 3, 10, 13, 18, 21, 33, వెనుకబడిన తరగతులు జనరల్ 5,8, 15,16, 23, 24, షెడ్యూల్ కులాలు **మహిళలు:** 11, 35, షెడ్యూల్ తెగలు ( మహిళలు) 6, షెడ్యూల్ తెగలు జనరల్ 17 వార్డుల రిజర్వేషన్లును జనాభా ప్రాతిపదికపై తెలిపారు. నామినేషన్లను సోమవారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించబడుతుందన్నారు. నామినేషన్ల ఈనెల 14న నామినేషన్లకు చివరి తేది. 15న నామినేషన్ల పరిశీలన. ఎన్నికలు 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగిన వార్డు మెంబర్ల ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 2వ తేది ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. అలాగే భారీ బందోబస్తు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరు వాస్తవ్యులు కర్నాటి కొండపనాయుడు - శ్రీదేవిల కుమార్తె సిందుప్రియ - దిలీప్‌చౌదరి (హైదరాబాద్ వాస్తవ్యులు రాయపనేని మల్లిఖార్జునరావు - లీలల కుమారుడు)ల వివాహం ఈ నెల 9వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# సీమాంధ్రలో సెమీ ఫైనల్స్

(మొదటిపేజీ తరువాయి)

కొందరు పారిశ్రామికవేత్తలు చంద్రబాబు మీదున్న సామాజికవర్గ అభిమానం కొద్దీ ఆ పార్టీని బ్రతికిస్తూ వచ్చారు. చంద్రబాబు స్థానంలో చిరంజీవిలాంటి వాళ్లు ఉంటే ఈరోజు రాష్ట్రంలో ఎక్కడా పసుపు జెండా అన్నదే కనిపించేది కాదు. ఈసారి మాత్రం అధికారంలోకి ఎలాగైనా రావాలనే తపనతో చంద్రబాబు సర్వశక్తులూ ఒడ్డుతున్నాడు.

మొన్న రాష్ట్ర విభజన సమయంలో సమైక్య నినాదం ఎత్తుకోవడం వై.యస్.జగన్‌కు బాగా కలిసొచ్చింది. చంద్రబాబు విభజనకు వ్యతిరేకం చెప్పలేదు. సమన్యాయం మాత్రం అనగలిగాడు. కాని జగన్ సంపూర్ణంగా సమైక్యాంధ్రకే జైకొట్టాడు. వైకాపాకు అది బాగా కలిసొచ్చింది. వైయస్ ఇమేజ్‌తో పాటు జగన్ హవా బాగానే నడుస్తుంది. అయితే ఈ హవా సీమాంధ్రలోని 13జిల్లాలలో ఒకే రకంగా పనిచేస్తుందా లేదా కొన్ని జిల్లాలలో కులప్రభావం పనిచేస్తుందా అనేది చూడాలి. జగన్ హవా నడిస్తే మాత్రం అనంతపురం నుండి శ్రీకాకుళం దాకా 13జిల్లాల్లో ఒకే విధమైన ఫలితాలు రావడం ఖాయం. అలా కాకుండా కొన్ని జిల్లాలపై కులప్రభావం ఉంటే మాత్రం వైకాపా, తెలుగు దేశంల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ ఉంటుంది. అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో జగన్ ప్రభంజనం కనిపిస్తుంది. ఒక సామాజికవర్గం బలంగా వున్న గుంటూరు, కృష్ణ, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, విశాఖజిల్లాల్లో వైకాపాకు గట్టిపోటీ ఎదురయ్యే పరిస్థితులున్నాయి.

అయితే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఎటువంటి వాతావరణం నెలకొంటుందో ముందుగానే చెప్పేసే విధంగా మున్సిపల్, పంచాయితీరాజ్ ఎన్నికలు వచ్చాయి. ఈ రెండు రకాల ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రతి ఓటరూ పాల్గొంటాడు. ఈ ఎన్నికలకు సార్వత్రిక ఎన్నికలకు తేడా నెలరోజులు మాత్రమే. ఈలోపు ఓటరు అభిప్రాయం మారదు. మున్సిపల్, పంచాయితీ రాజ్ ఎన్నికల్లో ఫలితాలు వైకాపాకు ఏకపక్షంగా వస్తే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పోటీ చేయాల్సిన పని కూడా లేదు. అలాకాకుండా గట్టిపోటీ నడిస్తే మాత్రం రేపు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అధికారం కోసం హోరాహోరీ యుద్ధమే!

## నెల్లూరీయుడికి
# కమ్యూనిష్టు పగ్గాలు



రాష్ట్ర విభజన జరిగాక తొలిసారిగా సీపీఎం పార్టీ రెండు రాష్ట్రాలకు వేర్వేరు కమిటీలను నియమించింది. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రంను నియమించగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నెల్లూరురూరల్ మండలం కనుపర్తిపాడుకు చెందిన పెనుబల్లి మధును నియమించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గసమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కనుపర్తిపాడు గ్రామం కమ్యూనిష్టులకు కంచుకోట. ఆ గ్రామంలో పుట్టిన మధు చిన్నతనం నుండే వామపక్ష భావాలను వంట బట్టించుకున్నారు. 1970ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ స్థాపకులలో మధు ఒకరు. 1968లో కమ్యూనిష్టు పార్టీలో చేరారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కార్మిక సంఘాలు, రైతుకూలీ సంఘాలలో కీలకపాత్ర పోషించారు. హైదరాబాద్‌లో ఎంఐఎంను ఎదుర్కొని కార్మిక సంఘాలను నెలకొల్పారు. గతంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేసారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు.

# వ్యర్థప్రయత్నం 'జై సమైక్యాంధ్ర'

(మొదటిపేజీ తరువాయి)

బయటకొచ్చేసి సొంత పార్టీని పెట్టి వుంటే బాగుండేది. కాని రాష్ట్ర విభజన జరిగిపోయాక, సమైక్యాంధ్ర ఉద్యమం చల్లారిపోయాక, సీమాంధ్రకు పోతే ఎక్కడ తంతారోనని భయపడిన కేంద్రమంత్రులు కూడా తాపీగా, హ్యాపీగా సీమాంధ్రలో తిరగగలిగే ప్రశాంత వాతావరణం నెల కొన్నాక కిరణ్ సొంతపార్టీ పెట్టి ఏం లాభం? ఎవరికి లాభం?

సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే ఏ ప్రయత్నమైనా విజయవంతమవుతుంది. సరైన సమయంలో ధైర్యంగా నిర్ణయం తీసుకోలేకుంటే మాత్రం ఎటువంటి ప్రయత్నంకూడా విజయం సాధించలేదు. కిరణ్ సరైన సమయంలో నిర్ణయం తీసుకోలేదు. కేంద్రం రాష్ట్ర విభజనకు నిర్ణయం తీసుకున్నప్పుడే ఆయన తిరుగుబాటు జెండా ఎగరవేయాల్సింది. ఎందుకంటే ఆరోజు చాలామంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన వెంట ఉన్నారు. కిరణ్ రాజీనామా చేసుంటే ఆయన వెంట వాళ్లంతా రాజీనామాలుచేసి నడిచేవాళ్లు. ఆరోజు ప్రజలు తీవ్ర ఉద్వేగంతో ఉన్నారు కాబట్టి వాళ్ల నుండి కూడా కిరణ్‌కు ఆదరణ ఉండేది. రాజీనామాపైన సొంత పార్టీ విషయంపైన ఆయన తాత్సారం చేసారు. రాష్ట్ర విభజన జరిగిపోయింది. ప్రజలలో భావోద్వేగాలు చల్లబడ్డాయి. కాని ఈ తప్పు చేసిన కాంగ్రెస్‌ను మాత్రం శిక్షించకుండా వదలరు. అయితే రాష్ట్ర విభజనను జీర్ణించుకుంటున్నారు. హైదరాబాద్ పోతేపోయింది... ఇక మన ప్రాంతాలు అభివృద్ధి చెందితే చాలనుకుంటున్నారు. ఏది జరిగినా మన మంచికే అనుకోవడం మన వారికి అలవాటు. ఈ విషయాన్ని కూడా అదే కోణంలో చూస్తున్నారు. సమైక్య రాష్ట్రంగా ఉంటే నాయకులు హైదరాబాద్‌ను తప్పితే ఇంకే జిల్లాను అభివృద్ధి చేయరనేది ప్రజలకు అర్ధమైపోయింది. అందుకే విడిపోవడమే మేలనుకుంటున్నారు. ఈ నెల 12వ తేదీన రాజమండ్రి వేదికగా 'జై సమైక్యాంధ్ర' పార్టీ పెట్టిన కిరణ్ మాత్రం బెర్లిన్ గోడను పగలగొట్టి తూర్పు, పశ్చిమ జర్మనీలను ఏకం చేసినట్లు తెలంగాణ, ఆంధ్రాలను కలుపుతాననంటున్నాడు. ఆ తలనొప్పి మరోసారి అవసరమా? అసలు ఆ నినాదమే ఇక పనిచేయదు. 'జై సమైక్యాంధ్ర' అనే పార్టీ పేరే ఇప్పట్లో కరెక్ట్ కాదు. రాష్ట్రం విడిపోయాక ఈయన 'జైసమైక్యాంధ్ర' అని ఏం లాభం?

# ఎన్నికల జాతర

(మొదటిపేజీ తరువాయి)

నెల్లూరు నగరంలో కాంగ్రెస్‌పార్టీకి ఈ దుస్థితి రావడం చరిత్రలో ఇదే మొదటిసారి. కాంగ్రెస్‌పార్టీ నుండి పోటీ చేయడానికి ఎవరూ ధైర్యంగా ముందుకు రాలేకపోయారు. తెలుగుదేశం, వైకాపా టిక్కెట్ల కోసం మాత్రం నాయకులు తన్నుకున్నారు. ఒక్కో డివిజన్‌కు అయిదారుమంది కూడా పోటీపడ్డారు. టిక్కెట్లురాని నాయకులు కొంతమంది ఇండిపెండెంట్లుగా, రెబల్స్‌గా కూడా పోటీలో దిగడం జరిగింది. వైకాపాలోనూ, ఇటు తెలుగుదేశంలోనూ ఎన్నికల నేపథ్యంలో వర్గవిభేదాలు తెరకెక్కాయి. నగరంలో వైకాపాలో టిక్కెట్ల కుమ్ములాటలు బాగానే జరిగాయి. నగర, రూరల్ నియోజకవర్గాల సమన్వయకర్తలుగా ఉన్న పి.అనిల్‌కుమార్‌యదావ్, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు ఆయా డివిజన్‌లలో ఇంతకుముందే కార్పొరేటర్ అభ్యర్థులను నిర్ణయిస్తే, అసెంబ్లీ కంటే ముందే మున్సిపల్ ఎన్నికలు రావడంతో సీన్ మారిపోయింది. మేయర్ అభ్యర్థి అజీజ్, మేకపాటి వర్గం మనిషి కావడంతో టిక్కెట్ల కేటాయింపులో మేకపాటిదే పైచేయిగా నిలిచింది.

తెలుగుదేశంలో చూస్తే కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టి.రమేష్‌రెడ్డిలు అసంతృప్తితో ఉన్నారు. నగరం అసెంబ్లీ టిక్కెట్‌ను ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి కేటాయించడంతో వీరు నిరాశలో ఉన్నారు.

రాష్ట్ర విభజనతో నెల్లూరులోనూ కాంగ్రెస్‌పార్టీ దారుణంగా తయారైందనేదానికి ఈ ఎన్నికలే ఉదాహరణ. ఆ పార్టీ తరపున పోటీచేయడానికి ఎవరూ ముందుకు రాలేని దుస్థితి దాపురించింది.

కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలలోనూ, నాయుడుపేట నగర పంచాయితీలోనూ నామినేషన్ల పర్వం ముగిసి, ప్రచార పర్వానికి తెరలేచింది. అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలు జోరుగా నిర్వహిస్తున్నారు. మద్యం షాపులకు మాత్రం మంచి ఆదాయం ఉంది. ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని నియంత్రించేందుకు పోలీసులు చెక్‌పోస్టులు పెట్టుకుని ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. పోలీసుల తనిఖీలలో ఎలక్షన్ల డబ్బు దొరకడంలేదు. వ్యాపారులు, సన్నజనం అవసరాలకోసం తీసుకెళ్లే డబ్బులు పట్టుబడుతున్నాయి. మొత్తానికి జిల్లా అంతటా ఎన్నికల సందడి భలే రంజుగా ఉంది.

# జగన్ బాణం

(మొదటిపేజీ తరువాయి)

17వ తేదీ సాయంత్రం ఆత్మకూరులో వైకాపా మున్సిపల్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. 18వ తేదీ వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేటలలో జరిగే రోడ్‌షో, బహిరంగసభలలో పాల్గొంటారు. ఆరోజు రాత్రి గూడూరులో బస చేస్తారు. 19వ తేదీ ఉదయం గూడూరులో జరిగే రోడ్‌షోలో పాల్గొంటారు. ఆరోజు సాయంత్రం నెల్లూరుకు చేరుకుని ఇక్కడ జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. రాత్రికి నెల్లూరులోనే ఉండి, 20వతేదీ ఉదయం కావలికి చేరుకుని రోడ్‌షోలో పాల్గొని వైకాపా అభ్యర్థులకు ప్రచారం చేస్తారు.

# కాంగ్రెస్‌కు షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఈసారి ఎన్నికల్లో ఆమె పోటీకి దూరమయ్యారు. ఆమె పోటీకి అంగీకరించలేదు. 1995 తర్వాత భానుశ్రీ లేకుండా నెల్లూరులో మున్సిపల్ ఎన్నికలు జరగడమనేది ఇదే తొలిసారి.

1995లో ఆమె కొత్తగా రాజకీయాల్లోకి వచ్చింది. అరవింద్‌నగర్ ప్రాంతంలో అప్పుడు కాంగ్రెస్ కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచింది. 2000లో జరిగిన మున్సిపల్ ఎన్నికలలోనూ మళ్లీ విజయం సాధించింది. నెల్లూరు మున్సిపాల్టీ నగరపాలక సంస్థగా మారాక 2005లో నిర్వహించిన కార్పొరేషన్ ఎన్నికలలో ఆమె కార్పొరేటర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైంది. అయితే అప్పుడు నగరపాలక సంస్థకు తొలిమేయర్ కావాలనుకున్న ఆమె ప్రయత్నాలు ఫలించలేదు. అయితే రెండేళ్లు తిరక్కుండానే రెండో మేయర్ మాత్రం కాగలిగింది. ఆనం వివేకానందరెడ్డి లక్ష్యంగా ప్రత్యర్థులు చేసిన రాజకీయదాడుల్లో ప్రత్యక్షంగా ఆమె కూడా బాధపడాల్సి వచ్చింది. ఆమె ఇంటి మీదే ఏసిబి దాడులు జరిగాయి. ప్రత్యర్థులు ఎన్నో రాజకీయ, అవినీతి విమర్శలు ఆమె కేసే ఎక్కుపెట్టారు. ఎంత గందరగోళ రాజకీయాలలో ఉన్నా ఆమె తానుంటున్న డివిజన్‌ను ఎప్పుడూ విస్మరించలేదు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ అక్కడ అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా చేపట్టేది. కాబట్టే మళ్ళీ మళ్ళీ గెలవగలిగింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. కాంగ్రెస్ అంటేనే జనం కోప్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మేయర్‌గా ఎటువంటి అవకాశంలేదు. ఇంత ప్రతికూల పరిస్థితుల మధ్య పోటీ చేయడం దండగనే ఆమె విరమించుకున్నట్లు తెలుస్తుంది.

# తమ్ముడు తెరిచాడు

(మొదటిపేజీ తరువాయి)

బంద్ కాగా ఇప్పుడు ఆయన తమ్ముడు పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ కొత్త రాజకీయ దుకాణం తెరిచాడు. పార్టీ పేరు జనసేన. తెలంగాణ, సీమాంధ్రలో రెండుచోట్లా పోటీచేస్తారంట. ప్రధానపార్టీలలో టిక్కెట్లు దొరకని రాజకీయ నిరుద్యోగులకు ఇదే వేదిక అనుకోవచ్చు. అయితే రెండు రాష్ట్రాలలో అన్ని సీట్లకు పోటీ చేసే ఉద్దేశ్యం కూడా పవన్‌కు లేనట్లుంది. ఇప్పటికిప్పుడు అధికారంలోకి రాకపోయినా క్రమంగా బలపడాలన్నదే ఆ పార్టీ లక్ష్యంగా ఉంది.

చిరంజీవికి పవన్‌కు మధ్య విభేదాలున్నాయని, చిరంజీవి వైఖరి పవన్‌కునచ్చడంలేదని గత కొంతకాలంగా వినిపిస్తుంది. కాబట్టే పవన్ కొత్తపార్టీ వైపు మొగ్గుచూపారు. వాస్తవానికి పవన్ ఇప్పుడు సినిమాలను వదులుకుని పూర్తిగా రాజకీయాలలోకి రావాల్సిన పనిలేదు. గబ్బర్‌సింగ్, అత్తారింటికి దారేది సినిమాల సక్సెస్‌తో ఆయన కాల్షీట్లకు డిమాండ్ పెరిగింది. అభిమానుల్లో ఇమేజ్ కూడా పెరిగింది. అయితే ఇది రాజకీయంగా బలపడడానికి మాత్రం దోహదపడదు. చిరంజీవే ఈ రాజకీయాలలో నిలబడలేక చేతులెత్తేసాడు. చిరంజీవితో పోలిస్తే వ్యక్తిగతంగా పవన్‌కు ధైర్యస్థుడనే పేరుంది. అయితే వ్యక్తిగత విషయాలలో కొన్ని ఆరోపణలూ లేకపోలేదు. ముఖ్యంగా మూడుపెళ్లిళ్ల వివాదం ఆయనను పదేపదే వేలెత్తి చూపిస్తుంది.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం, వైకాపా, సీపీఎం, సీపీఐ, లోక్‌సత్తా, తాజాగా 'జై సమైక్యాంధ్ర'... ఇన్ని పార్టీలుండగా పవన్ 'జనసేన' ఏ మాత్రం నిలబడుతుందో చూడాలి.

**సవరణ:** తేది07.03.2014 సంచిక 5వ పేజీలో కాలధర్మం శీర్షికలో ప్రచురించిన వేలూరు చినపెంచలయ్య ఫోటోకు బదులుగా పొరపాటున మరో ప్రముఖ మాజీకార్పొరేటర్ ఫోటో ప్రచురించబడింది. ఈ పొరపాటుకు చింతిస్తున్నాము. - సం/-

# సంస్కార 'దీపికా'



హిందీలో కంగానారనౌత్ ప్రధాన పాత్రలో నటించిన 'క్వీన్' సినిమా మంచి కలెక్షన్లతో సూపర్‌హిట్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సినిమాను చూసిన దీపికా హీరోయిన్ కంగానారనౌత్‌ను అద్భుతంగా నటించిందని ప్రశంసిస్తూ తన సంస్కారాన్ని చాటుకుంది.



మూ'వీ'క్షణం



## గాయమైనా 'ఆగడు'

శ్రీనువైట్ల, మహేష్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆగడు' సినిమా షూటింగ్‌లో మహేష్‌కు గాయాలయ్యాయి. అయినా ఆయన కొద్దిరోజులే విశ్రాంతి తీసుకుని గాయాలను లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. ప్రిన్స్ పుట్టినరోజు మే31కి ఈ సినిమా విడుదలకానుంది.

## విశిష్టపాత్రలో ఎన్టీఆర్

అనుష్క ప్రధానపాత్రలో గుణశేఖర్ దర్శకత్వంలో రూపొందుతున్న 'రుద్రమదేవి' చిత్రంలో ఓ పాత్రకు హీరో దొరకడం లేదు. ఇందులో గోన గన్నారెడ్డి పాత్ర కీలకం. అది అనుష్కను ప్రేమించే పాత్ర. ఈ పాత్ర కోసం గుణశేఖర్ వెళ్లి రవితేజ, మహేష్ లాంటి కథానాయకులను సంప్రదించినా వాళ్లు అందుకు ఒప్పుకోలేదంట! అప్పుడు జూ॥ఎన్టీఆర్‌ను సంప్రదిస్తే... అనుష్క లాంటి భారీ రూపాన్ని పక్కన పెట్టుకుని, ఆమెను ప్రేమించే పాత్రలో ఎలా నటించాలని ఆయన గుణశేఖర్‌ను ప్రశ్నించాడట! అయితే గుణశేఖర్ మాత్రం ఎన్టీఆర్‌ను ఒప్పించే పనిలో ఉన్నాడు.

# ఆనంకు అంతవరకే ప్రాప్తం



రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్రలోని కాంగ్రెస్ నాయకులు చాలామంది పార్టీలు మారారు. కాంగ్రెస్ ద్వారా పదవులు, డబ్బులు సంపాదించుకున్న నాయకులు కూడా కాంగ్రెస్ ముఖాన ఉమ్మేసి వేరే పార్టీలు చూసుకున్నారు. సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి మునిగే పడవలా ఉందని తెలిసినా కూడా ఆనం సోదరులు ఆ పార్టీని విడవలేదు. కిరణ్ రాజీనామా చేస్తే తదుపరి సీఎంగా ఆనం రామనారాయణరెడ్డికి అవకాశం రావచ్చును కున్నారు. కాని కిరణ్ రాజీనామా తర్వాత సీఎం కుర్చీ ఎవరికీ ఇవ్వకుండా రాష్ట్రపతి పాలన పెట్టేయడంతో ఆనం నిరుత్సాహపడ్డారు. రాష్ట్ర విభజన జరిగాక అధిష్టానం తాజాగా తెలంగాణ, ఆంధ్రులకు ప్రత్యేక పీసీసీలను నియమించింది. కనీసం ఆంధ్రా పీసీసీ అధ్యక్షపదవి కూడా ఆనంకు దక్కలేదు. అది రఘువీరారెడ్డికి పోయింది. ఆనం రామనారాయణరెడ్డిని కేవలం ఎన్నికల మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్‌గా మాత్రమే నియమించారు. ఇచ్చిన దాంతోనే ఆయన సర్దుకోవాల్సి వచ్చింది.

## సిడబ్ల్యూసి ఛైర్మెన్‌గా రమేష్

నెల్లూరు బాలలహక్కుల సంరక్షణ కమిటీ ఛైర్మెన్‌గా డాక్టర్ సి. హెచ్. రమేష్‌బాబు నియమితులయ్యారు. ఆయన మూడేళ్లపాటూ ఈ పదవిలో ఉంటారు. 11వతేదీ నెల్లూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కమిటీలో చల్లా రమాదేవి, దండోలు జ్యోతి, ఇ.జయరాజ్, జి.మురళీకృష్ణ సభ్యులుగా నియమితులయ్యారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## పురపాలక ఎన్నికలకు ప్రత్యేక అధికారుల నియామకం



మాట్లాడుతున్న ఆర్డీవో కె.శ్రీనివాసరావు

గూడూరు పురపాలక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం నుండి ప్రారంభం కావడంతో నామినేషన్ల స్వీకరణకు సంబంధించి వివిధ శాఖలకు సంబంధించి 8మంది ప్రత్యేక అధికారులను నియమించినట్లు పురపాలక సంఘ ప్రత్యేకాధికారి ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆర్డీవోగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఆదివారం పురపాలకసంఘ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 10వతేదీ నుండి 14వతేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నియమనిబంధనల ప్రకారం నామినేషన్లు స్వీకరించాలని ఆయన కోరారు. గూడూరు పురపాలక సంఘానికి సంబంధించి 33 వార్డులు ఉన్నాయని వార్డుల వారీగా రిజర్వేషన్ల జాబితా ఇప్పటికే ప్రచురించినట్లు, రిజర్వేషన్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా తమ కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ఆర్డీవో అన్నారు.

## అనాథ చిన్నారులకు చేయూత



చిన్నారులకు నగదు అందజేస్తున్న శ్రీరామదూత ఆశ్రమం ప్రతినిధులు

తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ చిన్నారులను అన్ని విధాలా ఆదుకుంటామని కావలి సమీపంలోని చేవూరులో ఉన్న శ్రీ రామదూత ఆశ్రమం ప్రతినిధులు తెలిపారు. ఆ ఆశ్రమ గూడూరు ప్రతినిధులు మిద్దె వెంకటకృష్ణారావు, ఆమని డింపుల్ ఆదివారం చిన్నారులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాథలైన ప్రసాద్, దుర్గ, అజయ్, భవానీ, నాని, వాణికి తమవంతు చేయూత నిస్తామన్నారు. నాని, వాణిని ఆశ్రమంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తామని చిన్నారుల బంధువులకు తెలిపారు. భవానీ వైద్యానికి సాయం అందిస్తామన్నారు. వింజమూరుకు చెందిన మాల్యాద్రి ఇచ్చిన వెయ్యిరూపాయలు ఆశ్రమ ప్రతినిధులు చిన్నారులకు అందజేసారు.

## కన్నుల పండువగా శ్రీవారి కల్యాణోత్సవం



ఆలయంపై శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరులోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ విమాన, ధ్వజ, రాజగోపుర, కలశస్థాపన, మహాసంప్రోక్షణ కార్యక్రమం అనంతరం స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం వేదపండితులు కన్నుల పండువగా నిర్వహించారు. ఈనెల 7వతేదీ నుండి ఆలయంలో శ్రీవారి విమాన రాజగోపుర, మహాసంప్రోక్షణ మహోత్సవం వైఖానస శాస్త్ర విధి గోత్రమాహ్నిక దీక్షలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, పంచగవ్యారాధన, ప్రాసన, ఉక్త ప్రధాన హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి పనిచేయండి

పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కష్టపడి పనిచేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరిగ మురళీ తెలిపారు. గూడూరు నరసింహరావుపేటలోని సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాలరెడ్డి నివాసంలో సోమవారం మాట్లాడారు. పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల్లో 28వార్డుల్లో గెలుపు తమదేనని చెప్పారు.

పట్టణంలో వార్డు సభ్యుల ఎంపికకు ఓ కమిటీ నియమించామని, ఆ కమిటీ తీసుకున్న నిర్ణయానికే కట్టుబడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత

కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనదేశం సంస్కృతీ సంప్రదాయాలకు పెట్టింది పేరని ప్రతి ఒక్కరు శాంతికాములుగా జీవించేందుకు భగవన్నామస్మరణ ఎంతో అవసరమని ఇందుకోసం బ్రహ్మకుమారీలు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని నెల్లూరు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని నెల్లటూరు గ్రామంలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్మించిన మందిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ నిత్యం పనివత్తిడితో సతమతమయ్యే ప్రజలకు ఇటువంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో ధ్యానం చేసినట్లయితే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వాస్తవాన్ని గ్రహించడం లేదన్న స్వరూపానంద స్వామి సూక్తులను ఆయన ఉటంకించారు. నిత్యం భగవన్నామస్మరణ ఎంతో అవసరమన్నారు. సత్ప్రవర్తన, సద్బుద్ధి కలిగిఉండాలని, వీలున్నపుడు భగవంతుని ధ్యానంచేసి ఆరోగ్యంగా జీవించాలన్నారు. శివజయంతి రహస్యాన్ని కర్నూలుకు చెందిన సిస్టర్ మీరా వివరించారు. అంతకు ముందు విశ్వశాంతి జెండాను ఆవిష్కరించి జ్యోతిప్రజ్వలన కాకాణి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లు విజయకుమార్‌రెడ్డి, నెలబల్లి భాస్కరరెడ్డి, జి.గురునాథం, న్యాయవాది రఘురామిరెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా అభ్యున్నతికి...

## సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివి

మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే ఎనలేని కృషిచేసి ఆదర్శ మహిళగా కీర్తి గడించారని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య అన్నారు. గూడూరు రెండవ పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యాన సావిత్రి బాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు ప్రభాకర్, మునిరత్నం, రమణయ్య, గురుమూర్తి కృష్ణయ్య వార్డెన్ లీలమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా...

# ముగిసిన నామినేషన్ల పర్వం

జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థకు, కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట మున్సిపాల్టీలకు, నాయుడుపేట నగర పంచాయితీకి 13వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల పర్వం ముగిసింది. నెల్లూరు నగరపాలక సంస్థలో మొత్తం 54డివిజన్‌లకు గాను 656 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసారు. ఈ నెల 16వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంది. తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్ బుధవారం 8వ డివిజన్ నుండి తన నామినేషన్ దాఖలు చేసారు. తడికలబజార్‌వీధిలోని నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇంటి నుండి ర్యాలీగా బయలుదేరి తోట బడిలో ఆయన నామినేషన్ వేసారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ మేయర్ అభ్యర్థి షేక్‌అబ్దుల్ అజీజ్ 52వ డివిజన్ నుండి నామినేషన్ దాఖలు చేసారు. వైకాపా డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ప్రచారంలో వున్న ముక్కాల ద్వారకానాథ్, తెలుగుదేశం పార్టీ డిప్యూటీ మేయర్ రేసులో వున్న వాయుగుండ్ల వెంకటేశ్వర్లు 6వ డివిజన్ నుండి పోటీ పడుతుండడం విశేషం. ఆర్య వైశ్యులు అధికాంగా వున్న ఈ డివిజన్ రెండుపార్టీల అభ్యర్థులకు కూడా ప్రతిష్టాత్మకంగా మారింది.


నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న దేశం మేయర్ అభ్యర్థి డా॥ జడ్.శివప్రసాద్


నామినేషన్ దాఖలు చేస్తున్న వైకాపా మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్


కాంగ్రెస్ కార్పొరేటర్‌గా నామినేషన్ దాఖలు చేస్తున్న బుర్లా వెంకటేశ్వర్లు


నామినేషన్ దాఖలు చేస్తున్న బిజేపీ అభ్యర్థి

బుధవారం ఏకాదశి మంచిరోజు కావడంతో ఆరోజు అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేసారు. బుధవారం ఒక్కరోజే నెల్లూరు నగరపాలకసంస్థలో 216, కావలిలో 73, ఆత్మకూరులో 33, వెంకటగిరిలో 31, సూళ్లూరుపేటలో 27, గూడూరులో 24, నాయుడుపేటలో 5 నామినేషన్లు దాఖలయ్యాయి.

నెల్లూరు నగరపాలకసంస్థతో పాటూ మిగిలిన మున్సిపాల్టీలలో కూడా అభ్యర్థుల ఎంపికకు పార్టీలు భారీఎత్తునే కసరత్తు చేసాయి. వైకాపా, తెలుగుదేశం టిక్కెట్లకు డిమాండ్ తలెత్తడంతో అభ్యర్థులను ఎంపిక చేయడం నాయకులకు పెద్దసమస్యగా మారింది. నెల్లూరు కార్పొరేషన్‌లో అయితే నాయకులు వాటా వేసుకుని తమ అనుచరులకు సీట్లు ఇప్పించుకోవడానికి నానాతంటాలు పడ్డారు. తెలుగుదేశంపార్టీ కార్పొరేటర్ టిక్కెట్ల కేటాయింపు విషయంలో ఇద్దరు పార్టీ నాయకుల మధ్య తీవ్ర గొడవ జరిగినట్లు తెలుస్తుంది. అలాగే వైకాపా టిక్కెట్ల పెత్తనమంతా ఒకేవర్గం చేతిలోకి తీసుకోవడంతో పార్టీ నగ సమన్వయకర్త అనిల్‌కుమార్‌యాదవ్ ఆగ్రహించారు. కొన్ని డివిజన్‌లలో పార్టీ టిక్కెట్లు రాని నాయకులు ఇండిపెండెంట్లుగా రంగంలోకి దిగారు. నాయకులు వారిని బుజ్జగించే పనిలోపడ్డారు.

నామినేషన్ల తంతు పూర్తికావడంతో సీట్లు ఖరారైన అభ్యర్థులు ప్రచారంలో పడ్డారు. ఎన్నికలకు ఇక 15రోజులే ఉండడంతో ఎక్కేగడప దిగేగడప సందులేకుండా తిరుగుతున్నారు. అభ్యర్థులు హంగూ ఆర్భాటం లేకుండా సాధ్యమైనంతవరకు నేరుగా కలుస్తున్నారు.













## జ్ఞాపకశక్తిపై రోటరీ క్లబ్ ఉచిత శిక్షణ


విద్యార్థులకు శిక్షణనిస్తున్న రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు మద్రాసు బస్టాండు దగ్గరగల సుంకు చెంగన్న నగరపాలక పాఠశాల ప్రాంగణంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న జ్ఞాపకశక్తి, వేగవంత గణితం, యోగాలపై ఉచితంగా శిక్షణను నిర్వహించారు. రొటేరియన్ సనత్ ఈ శిక్షణను ప్రతి రోజూ ఇస్తారని, వివరాలకు 9441854387లో సంప్రదించవచ్చని రోటరీక్లబ్ ప్రెసిడెంట్ టి.శేఖర్, సెక్రటరీ కె.ప్రతాప్‌కుమార్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, పురప్రజలు సద్వినియోగం చేసుకోవలసిందిగా వారు కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్, శిక్షకులు సనత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మళ్ళీ మారుతున్న విష్ణు



మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మళ్ళీ పార్టీ మారబోతున్నాడు. కాంగ్రెస్‌ను వదిలి వైయస్సార్ కాంగ్రెస్ గూటికి చేరబోతున్నాడు. కేవలం రెండేళ్ల కాలంలోనే ఆయన రెండుసార్లు కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి రెండుసార్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం విశేషం.

కాటంరెడ్డి ఆదినారాయణరెడ్డి రాజకీయ వారసుడిగా వచ్చిన విష్ణును అల్లూరు ప్రజలు బాగా ఆదరించారు. ఒకప్పుడు ఈ నియోజకవర్గంలో సినీహీరోకున్నంత ఇమేజ్ వుండేది. 1979 నుండి ఆయన ప్రత్యక్ష రాజకీయాలలో ఉన్నారు. 1989లో అల్లూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 1994, 1999లలో ఓడిపోయారు. 2004లో మళ్ళీ విజయం సాధించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన వల్ల అల్లూరు ఎగిరిపోవడంతో కావలి నుండి పోటీ చేసారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయారు.

ఈ జిల్లాలో దివంగత నేత వైయస్‌కు మొదటి అనుచరుడు విష్ణు. ఆ విశ్వాసం ఉండబట్టే 2009ఎన్నికల్లో విష్ణు ఓడిపోతాడని తెలిసి కూడా వై.యస్. ఆయనకు కావలి సీటిచ్చాడు. వై.యస్ మరణం తర్వాత జగన్ కాంగ్రెస్ నుండి బయటకు రావడం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించడంతో విష్ణు కూడా కాంగ్రెస్‌ను వదిలివచ్చాడు. వైకాపాలో చేరి పనిచేయసాగాడు. అయితే కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని నియమించడంతో మనస్థాపం చెంది తిరిగి కాంగ్రెస్‌కు వెళ్లిపోయారు. కాని ఇప్పుడు రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ ఎత్తిపోయింది. ఇక ఆ పార్టీ దండగనుకుని విష్ణు మళ్ళీ వైకాపాలో చేరుతున్నారు.


ప్రథమ వర్ధంతి

మంచితనాన్ని మాకు పంచి,
మానవత్వాన్ని మాలో పెంచి
తన మధురజ్ఞాపకాలను మాకు మిగిల్చిన
డాక్టర్ వి.యస్.రెడ్డి గారు
స్వర్గస్తులై 18.03.2014 నాటికి యేడాది
గడవనున్న సందర్భంగా వారిని స్మరించుకుంటూ
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య: డా॥ వి.ఇందిర, రేడియాలజిస్టు
ఇందిరా స్కానింగ్ సెంటర్, నెల్లూరు.
కుమారుడు: వి.శ్రీచంద్‌రెడ్డి
కుమార్తె: వి.కీర్తనరెడ్డి


స్వర్గీయ డాక్టర్ వి.యస్.రెడ్డి గారు
సైకియాట్రిస్ట్
జననం: 09.12.1960
మరణం: 18.03.2013

ఉచిత వైద్య శిబిరం: తేది 18.03.2014 మంగళవారం ఉ॥ 9గంటల నుండి 12గంటల వరకు నెల్లూరు పొగతోటలోని డా॥ వి.యస్.రెడ్డి హాస్పిటల్ నందు జరుగును.


Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.